విశాలాంధ్ర



ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

మంగళవారం 05 నవంబరు 2024 8 పేజీలు

రైతాంగాన్ని ఆదుకోవాలి

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం డిమాండ్

విశాలాంధ్ర - ఏలూరు: ప్రస్తుత కూటమి ప్రభుత్వం గత ఎన్నికల సందర్భంగా తాము

అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు పెట్టుబడి సాయంగా రూ.20 వేలు ఇస్తామని చేసిన వాగ్దానాన్ని తక్షణం అమలు చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతాంగాన్ని ఆదుకోవాలంటూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సమితి ఇచ్చిన పిలుపుమేరకు సోమవారం స్థానిక చేపల తూము సెంటర్ వద్దగల 27వ సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసిం దని, రబీ సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడి కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తున్నారని కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి మీనమేషాలు లెక్కిస్తుందని ఎద్దేవా చేశారు. రైతాంగాన్ని ప్రభుత్వం రక్షించే బాధ్యత తీసుకోవా లని కోరారు. రైతులకు పండించిన పంటకు కనీసం మద్దతు ధర ప్రకటించాలన్నారు. రాష్ట్రంలో ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడానికి పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 32 మంది ఆత్మ బలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో పలు జిల్లాలలో సెజ్‌ల పేరుతో పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం రైతుల నుండి సేకరించిన భూములు వినియోగించకుండా ఉన్నాయని, ఆ భూములను తిరిగి రైతాంగానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కారం కానిపక్షంలో రైతులు పెద్ద ఎత్తున ఉద్యమిస్తారని కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి రఘు, కురెళ్ళ వరప్రసాద్, నాగం అచ్యుత్, తెర్లాపు శ్రీను, భజత్రీ శ్రీనివాస్, మహమ్మద్ అబ్దుల్ హకీమ్, అబ్దుల్ రషీద్, సాయన బాలు, గొర్లి స్వాతి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడులో: నూజివీడు మండలంలోని గ్రామ సచివాలయాల్లో పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ

సందర్భంగా రైతుసంఘం సీనియర్ నేత కొమ్మన నాగేశ్వరరావు మాట్లాడుతూ ▶మిగతా 2లో..

మత్తులో మాస్టారు

- మద్యం సేవించి పాఠశాలకు హాజరు
- పిల్లలపై ప్రతాపం
- చంపుతానంటూ బెదిరింపు
- పాఠశాలకు తాళం వేసిన తల్లిదండ్రులు
- వివాదాస్పద మైన నెమెలిపేట పాఠశాల

విశాలాంధ్ర-కుక్కునూరు : పాఠశాలలో విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పించాల్సిన ఓ టీచర్ తప్పతాగి విధులకు హాజరవుతున్నాడు. తాగిన మైకంలో పిల్లలను కొడుతూ ఈ విషయం బయటకు పొక్కితే చంపుతానంటూ పిల్లలపై ప్రతాపం ప్రదర్శిస్తున్నాడు.పాఠశాలకు వెళ్లాలంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నారు.ఆఖరికి పిల్లలు తమ తల్లిదండ్రులకు జరుగుతున్న ఘోరాన్ని చెప్పడంతో పాఠశాల వద్ద పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. పాఠశాలకు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ ఘటన కుక్కునూరు మండలంలో చర్చనీయాంశంగా మారింది.తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. నెమెలిపేట ఎంపిపి పాఠశాల్లో ఓ టీచర్ కొంతకాలం నుంచి తరుచు మద్యం తాగి విధులకు వస్తున్నారని పేర్కొన్నారు. తాగిన మత్తులో పిల్లలపై కర్కశంగా ప్రవర్తిస్తున్నట్టు తెలిపారు. పిల్లలను కొడుతూ విషయం బయటకు పొక్కితే ▶మిగతా 2లో..

పిఠాపురం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి

రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్

విశాలాంధ్ర - బ్యూరో- కాకినాడ : పిఠాపురం నియోజక వర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక ఏరియా డవలెప్మెంట్ ఏజెన్సీని ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తెలియజేశారు. ఆయన సోమవారం పిఠాపురం నియోజక వర్గంలోని గొల్లప్రోలు, పిఠాపురం, పి వెంకటాపురం, యు కొత్తపల్లిలలో విస్తృతంగా పర్యటించి పలు ప్రారంభోత్సవ, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటనలో తొలుత ఆయన గొల్లప్రోలు చేరుకుని జడ్పి బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా బాలుర పాఠశాలలో 30 వేల రూపాయలతో ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించి 10వ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు మానసికంగాను, శారీరకంగాను ధృడంగా ఉండి దేశం కోసం పాటుపడే పౌరులుగా ఎదగాలన్నారు. బాలుర పాఠశాల విద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్ ల్యాబ్ కావాలని ఈ సందర్భంగా ఆయనను కోరగా త్వరలో ఏర్పాటు చేస్తామని తెలియజేశారు. అనంతరం పిఠాపురం మండలానికి సంబంధించి పిఠాపురం టిటిడి కళ్యాణ మండపంలోను, యు కొత్తపల్లి మండలానికి సంబంధించి యు కొత్తపల్లి పిహెచ్సిలోను అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ పర్యటనలలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జిల్లా ఎస్పి విక్రాంత్ పాటిల్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, కూటమి పార్టీల నేతలు మర్రెడ్డి శ్రీనివాస్, బుర్రా రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ అమలు చేయాలి

కలెక్టరేట్ ఎదుట బికెఎంయు ధర్నా

విశాలాంధ్ర - అమలాపురం : ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బికెఎంయు) రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా జరిగిన ధర్నాను ఉద్దేశించి సీపీఐ అంబేద్కర్ కోనసీమ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలలో ప్రధానంగా స్కూలుకు వెళ్లే విద్యార్థులకు 15 వేల రూపాయలు ఇవ్వాలని, ప్రతి రైతుకు ఏడాదికి 20 వేల రూపాయలు ఇవ్వాలని, నిరుద్యోగులకు మూడు వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బికేఎంయు గౌరవ అధ్యక్షులు దేవ రాజేంద్రప్రసాద్, జిల్లా అధ్యక్షులు శీలం వెంకటేష్, ప్రధాన కార్యదర్శి కొండే రామకృష్ణ, వి. శ్యామ్యూల్, పెద్దిరెడ్డి రాము, జి రవికుమార్, విజయకుమార్, చిట్టి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో : సూపర్ సిక్స్ పథకాలు అమలు

చేయాలని బికేఎంయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బండి వెంకటేశ్వరరావు, కుంచే వసంతరావు డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ▶మిగతా 4లో..

అనుమతి లేని రొయ్యల చెరువులను మూసివేయాలి

విశాలాంధ్ర - అమలాపురం : అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలోని చింతలపల్లి గ్రామంలో అనుమతులు లేకుండా అక్రమంగా సాగు చేస్తున్న రొయ్యల చెరువులను తక్షణమే మూసివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద బాధితులు సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ రొయ్యల చెరువుల వల్ల నీరు గాలి కలుషితమై ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని, పశువులకు తాగేందుకు మంచినీళ్లు కూడా కరువయ్యాయని బాధితులు వాపోయారు. ఏరియేటర్స్ వలన రాత్రులు కూడా ఇక్కడి ప్రజలకు నిద్ర పట్టక, శబ్ద కాలుష్యం వలన ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, 300 అడుగుల లోతు బోర్లను ఉప్పు నీటి కోసం త్రవ్వుతూ మరింత ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజా ▶మిగతా 2లో..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి

విశాలాంధ్ర- పాలకోడేరు : అర్హత కలిగిన పట్టభద్రులందరు ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేయించుకోవాలని పాలకోడేరు మండల తహసిల్దార్ నడుంపల్లి భారతి విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఎమ్మెల్సీ ఓటరు నమోదుకు ఈనెల ఆరవ తేదీ వరకు సమయం ఉందని, అందువలన అర్హత కలిగిన వారందరూ త్వరగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆమె మాట్లాడుతూ పట్టభద్రులు 2021 అక్టోబర్ 31కు ముందు డిగ్రీ పూర్తి చేసి ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫారం -18 లో తమ వివరాలు నమోదు చేసుకుని, దానితోపాటు డిగ్రీ, ఇంటర్, పదవ తరగతి సర్టిఫికెట్లను గెజిటెడ్ అధికారి వారిచే ధ్రువీకరించి జత చేయాలన్నారు. వీటితోపాటు ఆధార్ కార్డ్, ఓటర్ ఐడి కార్డ్ జిరాక్స్‌లను కూడా సమర్పించాలని ఆసక్తిగల పట్టభద్రులు వెంటనే ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఆర్థికసాయం

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలోని దళితవాడలో దివ్యాంగుడైన దువ్వూరు మోషేకు జీవనాధారంగా ఉన్న బడ్డీ కొట్టు పడిపోవడంతో లిడ్‌క్యాప్ మాజీ డైరెక్టర్ సందీప్ ఆర్థిక సాయం అందించారు. కొట్టు నిర్మించుకొని వ్యాపారం చేసుకునేందుకు సందీప్ తన వంతు సహకారం అందించారు.

ఆత్మీయ కలయిక

విశాలాంధ్ర-లింగపాలెం: కే.గోకవరంలో 2012-13 సంవత్సర కాలంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులంతా కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కే. గోకవరం ఉన్నత పాఠశాలలో జరిగిన ఆత్మీయ కలయికలో పూర్వపు విద్యార్థులంతా ఉల్లాసంగా, ఆటపాటలతో గడిపారు. ఈ సందర్భంగా ఆ సమయంలో ఇంగ్లీషు మాస్టర్‌గా పనిచేసిన సి.హెచ్ జయరాజుతోపాటు మరో 9మంది ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా జయరాజు మాస్టర్ మాట్లాడుతూ పూర్వపు విద్యార్థులు ఇలా ఆత్మీయ సమ్మేళనాలను ఏర్పాటు చేసుకోవడం మంచి సాంప్రదాయమని అన్నారు.

సమాజ సేవకురాలికి సంతాపం

విశాలాంధ్ర-లింగపాలెం: వయోభారంతో మృతిచెందిన తిమ్మక్కపాలెంకు చెందిన సమాజ సేవకురాలు, రాజకీయ నాయకురాలైన ధనలక్ష్మికి వైసీపీ నాయకులు ముసునూరు వెంకటేశ్వరరావు,లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సందీప్ సంతాపం తెలిపారు. ఈమెభర్త వసంతరావును పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలు సేవలను గుర్తు చేసుకున్నారు.

నలుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర-టి నరసాపురం : పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎం. రాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం అప్పలరాజుగూడెం గ్రామ శివార్లలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో సోమవారం దాడి చేసి నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద రూ.15వందల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

మూసివేయాలి

(1వ పేజీ తరువాయి)

ప్రతినిధులకు అధికారులకు అనేకసార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ యధావిధిగా రొయ్యల చెరువులు సాగు చేస్తున్నారని, తక్షణమే ఈ అక్రమ రొయ్యల చెరువులను మూసివేయాలని సోమవారం జిల్లా కలెక్టర్, ఆర్ మహేష్ కుమార్‌కి వినతి పత్రం సమర్పించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఐ జిల్లా నాయకులు కె సత్తిబాబు, సిపిఐ రాజోలు ఏరియా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్, చింతలపల్లి సర్పంచ్ మట్ట సురేష్ కుమార్, కటికిదల శ్రీను, సరెళ్ళ శివ తదితరులు నాయకత్వం వహించారు.

మత్తులో మాస్టారు

(1వ పేజీ తరువాయి)

చంపుతానంటూ బెదిరింపు లకు పాల్పడు తున్నట్టు వెల్లడించారు.కాగా సోమవారం పిల్లల తల్లిదండ్రులు పాఠశాల వద్ద ఆందోళన చేసి పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ..టీచర్ పాఠశాలకు వస్తే పిల్లలను బడికి పంపబోమని అన్నారు.విధులకు

దుమ్ము కొడుతూ..పిల్లలపై పైశాచికంగా ప్రవర్తిస్తున్న టీచర్ పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విషయం తెలుసుకున్న ఎంఈఓ గిరి భగవాన్ దాస్ పాఠశాలను తనిఖీ చేసి విచారణ చేపట్టారు. అక్కడే ఎంఈఓకి పిల్లల తల్లిదండ్రులు వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు ,గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతాంగాన్ని ఆదుకోవాలి

(1వ పేజీ తరువాయి)

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు పంట పెట్టుబడి సాయం ఇస్తామనే వాగ్దానం అమలుచేయకపోవడం రైతాంగాన్ని మోసగించడమే నన్నారు. ప్రస్తుతం రబీ సీజన్ వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదని విమర్శించారు. వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి మెట్ట ప్రాంతాల్లోని ప్రజలకు తాగునీరు, సాగునీరు అందించే చర్యలు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. వివిధ గ్రామాల్లో జరిగిన ఈ కార్యక్రమంలో రైతుసంఘం నేతలు నిమ్మగడ్డ నరసింహా, మడుపల్లి నాగేంద్రరావు, బొప్పుడు రాంబాబు, ముధగాని సుధాకర్, నక్కా మహాలక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

ముసునూరులో : మండలంలోని ముసునూరు,రమణక్కపేట, చెక్కపల్లి, లోపూడి,

అక్కిరెడ్డిగూడెం, వలసపల్లి,తదితర గ్రామాల్లోని సచివాలయాల్లో సోమవారం వినతి పత్రాలను అందజేశారు కార్యక్రమంలో మండల నేతలు చెంగల వెంకటేశ్వరరావు, కూచిపూడి నాగేశ్వర రావు, మల్లవల్లి మన్మధరావు, కొక్కెరపాటి ఆనంద్,పామర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడిలో: రైతులకు పెట్టుబడి సాయం రూ. 20 వేలు రైతు ఖాతాల్లో జమ చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. పెట్టుబడి సాయం విడుదల చేయాలని కోరుతూ ఏపీ రైతు సంఘం రాష్ట్ర పిలుపులో భాగంగా ఎర్రగుంటపల్లి రేచర్ల మల్లయ్య గూడెం చింతలపూడి రెండవ సచివాలయం చింతలపూడి ఐదవ సచివాలయం లలో కార్యదర్శులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ ఆచార్యులు ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ మాట్లాడుతూ 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం అందిస్తామని, గత ప్రభుత్వ విధానాల వల్ల మన రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై రూ.2 లక్షల 45 వేల రుణం ఉన్నదని, ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసింది రవి సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న దశలో మీరు ప్రకటించిన రైతుకు 20వేల రూపాయల పెట్టుబడి సాయం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.రైతుల సౌకర్యార్థం చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని సత్వరం పూర్తి చేయాలని 32 మంది విద్యార్థుల ప్రాణ త్యాగాలు ప్రజాప్రతినిధుల రాజీనామాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటుపరం కాకుండా నిలుపరింప చేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఎర్రగుంటపల్లి సచివాలయంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పుల్లూరి సోమశేఖర్ రేచర్లలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ, మల్లయ్య గూడెంలో రైతు సంఘం నాయకులు తక్కెలపాటి ప్రసాదరావు, ఎండపల్లిలో జిల్లెల్ల కృష్ణ, చింతలపూడి టు సచివాలయం నందు ఎస్ కే జానీ, చింతలపూడి ఐదవ సచివాలయం నందు ఎస్కే కాలేషా, వారి ఆధ్వర్యంలో వినతి పత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తోర్లపాటి బాబు, జంగా రామచంద్రారెడ్డి, రైతు సంఘం నాయకులు సంకు సత్యనారాయణ, మా ఊరి

సత్యనారాయణ రెడ్డి, గట్టు వెంకటేశ్వరరావు, ముల్ల గిరి అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

తారకరామా కన్‌స్ట్రక్షన్స్ వితరణ

విశాలాంధ్ర -భీమవరం: విజయవాడ వరద బాధితుల సహాయార్థం దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళాలు అందించడం అభినందనీయమని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. తారకరామా కన్‌స్ట్రక్షన్ చైర్మన్,

విస్సాకోడేరు లేఅవుట్ ప్రధానమంత్రి ఆవాస్ యోజన గృహ నిర్మాణ పథకం కాంట్రాక్టర్ పళ్ళ ఏసుబాబు, వైస్ చైర్మన్ తారక రామ్‌లు ఎమ్మెల్యే నివాసం వద్ద విజయవాడ వరద బాధితుల సహాయార్థం రూ. 2 లక్షల విరాళాన్ని ఎమ్మెల్యేకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు దాతల నుండి కోటి ఒక లక్ష నలభై వేల రెండు వందల రూపాయలు విరాళాల రూపంలో వచ్చాయని, దాతలను అభినందించారు. కార్యక్రమంలో వద్ది సుబ్బారావు, జంపన ఫణిబాబు, కారుమూరి సత్యనారాయణమూర్తి, చింతలపాటి బంగార్రాజు, ఆకుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

విశాలాంధ్ర - ఉండి : పరిసరాల పరిశుభ్రత పాటిస్తే సగం రోగాలు రావని ఉండి లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షులు డాక్టర్ గాదిరాజు రంగ రాజు అన్నారు. ఉండి రైల్వే స్టేషన్‌లో సోమ వారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం సోమ వారం చేపట్టారు. ఈ

సందర్భంగా క్లబ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ గాదిరాజు రంగరాజు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి భాధ్యత అన్నారు.ప్లాట్ ఫారం మీద పెరిగి పోయిన పనికి రాని మొక్కలను శ్రమదానం తో తొలగించారు. కొన్ని మొక్కలు నాటారు.ఈ కార్యక్రమానికి దాత లయన్ రుద్రరాజు నరసరాజు సహకరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ముదునూరి శివరామరాజు, కాగిత మహంకాళి, భూపతి రాజు హరనాథ్ రాజు, గొట్టుముక్కల రాము, కలిదిండి సీతారామరాజు, గాదిరాజు వెంకటేశ్వరరాజు, స్టేషన్‌మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర ప్రతినిధి -ఏలూరు : రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. సోమవారం ఏలూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని కోర్టుల పరిధిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని చెప్పారు. రాజీయోగ్యమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, వాహన ప్రమాద బీమా కేసులు, కుటుంబ వివాదాలు, చిట్‌ఫండ్స్ వివాదాలు, బ్యాంకు లావాదేవీల కేసులు, టెలిఫోన్ బకాయిల కేసులు, మున్సిపల్ ఆస్తి మరియు నీటి పన్నుల కేసులను ఈ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేయనున్నట్టు తెలియజేశారు. ప్రతి శనివారం అన్ని కోర్టులలో ప్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నారని, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ ప్రతిరోజు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల వరకు కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం నిర్వహిస్తున్నారని ఏలూరు కోర్టు పరిధిలోని కేసులనే కాకుండా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఇతర కోర్టుల పరిధిలోని కేసులను కూడా ఆన్లైన్ విధానం ద్వారా ఈ మధ్యవర్తిత్వం ద్వారా హాజరై తమ కేసులను రాజీ చేసుకోవచ్చునని తెలిపారు. ఈ కేసులలో సమస్యలు ఎదురైన 08812 224555 ఫోన్ నెంబర్ ద్వారా సంప్రదించాలని తెలిపారు.

అవినీతిని అరికట్టాలి

విశాలాంధ్ర -భీమవరం: అవినీతి దేశాన్ని మొత్తం నాశనం చేస్తుందని, దేశం ఆర్థికంగా నీతి వంతంగా ఎంతో నష్టపోతుందని, దీనిని అరికట్టకపోతే దేశ ప్రగతి తగ్గిపోతుందని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భీమవరం బ్రాంచి చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో సర్ సివీ రామన్ స్కూల్లో శ్రీ విజ్ఞానవేదిక, యూనియన్ బ్యాంక్, సర్ సివి రామన్ స్కూల్ ఆధ్వర్యంలో అవినీతి నిరోధక అవగాహన వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. నిర్మల జ్యోతి మాట్లాడుతూ ఒక బాధ్యత గల పౌరుడిగా అవినీతిని అరికట్టేందుకు మనవంతు ప్రయత్నం చేయాలన్నారు. స్కూల్ డైరెక్టర్ రమణం వేణు గోపాలరావు, ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ చట్టాలు కఠినంగా ఉంటేనే అవినీతిని అరికట్టవచ్చునని, చట్టాలపై ప్రజల్లో కూడా అవగాహన లేదన్నారు. అవినీతి రోజు రోజుకు పెరుగుతుందని, తగ్గడం లేదని, ఇది సంపూర్ణంగా అరికట్టాలని అన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.

కలెక్టర్ చొరవతో ఆర్జీదారునికి రుణ సహాయం

విశాలాంధ్ర -భీమవరం: కలెక్టర్ చొరవతో అర్జీదారునికి రుణ సహాయం లభించింది. అక్టోబర్ 28న జరిగిన మీకోసం కార్యక్రమంలో ఆచంట మండలం ఆచంట వేమవరం గ్రామానికి చెందిన బండి దుర్గారావు మీకోసం కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంటూ తమకు ఎలాంటి స్థలం లేకపోవడంతో గ్రామంలోని నక్కల కాలువ ఏరియాలో జీవనాధారం కోసం కుల వృత్తి అయిన సీమ పందుల జాతికి చెందిన 17 పందులను పెంచుకుంటున్నానని, వాటిని ఈ సంవత్సరం జూన్ 30 మారమ్మ జాతర రోజున పందులను దొంగిలించుకుపోయారన్నారు. వాటి విలువ సుమారు 5 లక్షల రూపాయలు ఉంటాయని, పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇవ్వడంతో, దొంగలను బాపట్లలో పట్టుకున్నారని, వాటిని అప్పటికే దొంగలు అమ్మేయడంతో నష్టపరిహారం నిమిత్తం 3 లక్షల రూపాయలను దొంగల ద్వారా ఇప్పిస్తామని తెలియజేసినట్లు పేర్కొ న్నారు. కేవలం 5 వేల రూపాయలు మాత్రమే ఇప్పించగా సమస్యపై మీకోసంలో దరఖాస్తు చేసుకున్నారు. స్పందించిన కలెక్టర్ చదలవాడ నాగరాణి డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాలతో చర్చించి బండి దుర్గారావు సతీమణి బండి రాణి పేరున స్త్రీ నిధి నుండి ఒక లక్ష రూపాయలు, సిఐఎఫ్ నుండి రూ.50 వేలు మొత్తం రూ.1.50 లక్షలను రుణంగా మంజూరు చేస్తూ చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా సోమవారం మీకోసం సమావేశ మందిరంలో అందజేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా పరిషత్ విద్యార్థుల విజయం

విశాలాంధ్ర - గణపవరం: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలు ఆదివారం, సోమవారాలలో రెండు రోజులు పాటు కడప జిల్లా పులివెందులలో జరిగాయి. రాష్ట్ర స్థాయి పోటీలలో గణపవరం జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలుర) విద్యార్థులు బాలికలు అండర్ 17 విభాగంలో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానం ఐదుగురు విద్యార్థులు విజయం సాధించినట్లు హై స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఎం. పద్మావతి తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ పద్మావతిని ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయ సిబ్బంది విద్యా కమిటీ చైర్మన్ నిర్మల కుమారి అభినందించారు.

సీసీ కెమెరాల అమరికతో వేధింపులకు చెక్

డీఎస్పీ శ్రావణ్ సూచన

విశాలాంధ్ర ప్రతినిధి- ఏలూరు : విద్యార్థినుల పట్ల వేధింపులకు పాల్పడే వారిని గుర్తించేందుకు ఆయా కళాశాలల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఏలూరు డిఎస్పి డి.శ్రావణ్ కుమార్ సూచించారు. సోమవారం ఏలూరులోని డిఎస్పి కార్యాలయంలో నగరంలోని వివిధ కళాశాల యాజమాన్యాలు, అధ్యాపకులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రావణ్ మాట్లాడుతూ కళాశాలల వద్ద విద్యార్థినులపై జరిపే ఆకతాయిల వేధింపులను అరికట్టాలంటే కళాశాలల వద్ద సీసీ కెమెరాలు తప్పని సరిగా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కళాశాలకు వచ్చే విద్యార్థిని, విద్యార్థుల కదలికలపై ఎక్కువగా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. తరగతి గది, ఆవరణతో పాటు రోడ్డుకు అభిముఖంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తే సాధ్యమైనంత వరకు తప్పులు నిరోధించగలరని చెప్పారు. ఆధునిక సాంకేతికంగా అభివృద్ధి చెందిన వైఫై సదుపాయాలు కలిగిన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆయా లింకులను పోలీస్ కంట్రోల్ రూముకు అనుసంధానం చేస్తే పోలీసుల పర్యవేక్షణ కూడా ఉంటుందని వివరించారు. దీంతో కళాశాల వద్ద ఏదైనా జరగరాని సంఘటన జరిగిన వెంటనే సీసీ కెమెరాలు పర్యవేక్షణ ద్వారా పోలీసులు తగిన చర్యలు తీసుకోవడానికి ఉపయోగపడుతుందని కళాశాల యాజమాన్యం గుర్తించాలని డిఎస్పి సూచించారు. ఈ సమావేశంలో ఏలూరు త్రీ టౌన్ సిఐ కోటేశ్వరరావు, ట్రాఫిక్ సిఐ లక్ష్మణరావు, మహిళా పోలీస్ స్టేషన్ సిఐ సుబ్బారావు, కళాశాల యాజమాన్యాలు పాల్గొన్నారు.

హేలాపురి బాలోత్సవ సావనీరు ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర ప్రతినిధి-ఏలూరు: హేలాపురి బాలోత్సవం పిల్లల సంబరాల సావనీర్ ను జిల్లాకలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆవిష్కరించారు. సోమవారం కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో హేలాపురి బాలోత్సవ కమిటీ ముద్రించిన నాలుగోవ పిల్లల సంబరాల జ్ఞాపకాల సంచికను జిల్లా కలెక్టర్ కె . వెట్రి సెల్వి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి, డిఆర్ఓ వి .విశ్వేశ్వరరావు, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు డిప్యూటీ కలెక్టర్లు ముక్కంటి, భాస్కర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుడిపాటి నరసింహారావు మాట్లాడుతూ పిల్లల సంబరాలు పేరుతో విద్యా సంబంధ కళా సంబంధ అంశాల్లో విద్యార్థుల సృజనాత్మకతను పెంచే వేదికను అందించడానికి ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ 4 వ పిల్లల సంబరాలు పూర్తయ్యాయని ఐదవ పిల్లల సంబరం జనవరి నెలలో నిర్వహించబోతున్నామని ప్రకటించారు. ఐదవ పిల్లలు సంబరాలు వట్లూరులోని సిద్ధార్థ క్వెస్ట్ స్కూలులో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ సంఘాలకు, సంస్థలకు చెందిన హేలాపురి బాలోత్సవం నిర్వాహకులు ఎంఎస్ కుమార్, విజిఎంవిఆర్ కృష్ణారావు, దేవరకొండ వెంకటేశ్వర్లు, ఎస్ కస్తూరిరావు, వి సురేష్, మేతర అజయ్ బాబు , పి ఆంజనేయులు, డి శివప్రసాద్, వి శేషగిరిరావు, కే సిద్ధార్థ, ఎం సురేష్ బాబు, కే సోమల నాయక్, జి సురేష్, ఎస్ రవి, రేటు, కే జనని, బి సోమయ్య ,కే శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

విశాలాంధ్ర -కామవరపుకోట : ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు చింతలపూడి ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ అన్నారు. సోమవారం కామవరపుకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రు. 50 లక్షల నిధులతో పబ్లిక్ హెల్త్ యూనిట్ కు ఎమ్మెల్యే రోషన్ కుమార్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రోషన్ కుమార్ మాట్లాడుతూ కామవరపుకోట ప్రభుత్వాసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఖరీదైన వైద్యం అందించాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. వైద్యుల నుండి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి, తగు సేవలు అందించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కరిపోతు అనూష, మండల టిడిపి అధ్యక్షులు కిలారు సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ కోనేరు వెంకట సుబ్బారావు, మద్దిపోటి నాగేశ్వరరావు, ఘంటాసుధీర్ బాబు, గంటా సత్యంబాబు, దోలా విజయ్, నన్న హరిచంద్ర ప్రసాద్, దొడ్డాకుల గంగాధరరావు, ప్రభుత్వ వైద్యాధికారి ప్రసన్న కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నూతన పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభం

విశాలాంధ్ర - ఉండి : క్రైమ్ రహిత నియోజకవర్గంగా ఉండి నియోజకవర్గం ఉండబోతుందని స్థానిక ఎమ్మెల్యే కనుమూరి రఘు రామ కృష్ణంరాజు అన్నారు. ఉండి నూతన పోలీస్ స్టేషన్ భవనం ను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మితో కలిసి రఘురామ కృష్ణంరాజు సోమవారం ప్రారంభించారు. కలెక్టర్ నాగరాణి, ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మికి సీఐ జగదీశ్వరరావు ఎస్సై నసురుల్లా సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన విలేకరుల సమావేశంలో రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థ పటిష్టంగా ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వ పనితీరుకు కొలమానంగా ఉంటుందన్నారు. ప్రజలు సంతోషంగా ధైర్యంగా ఉండాలంటే ధైర్యాన్ని ఇచ్చేది పోలీస్ అన్నారు. ప్రభుత్వం నుంచి పోలీసుకు ఇన్ ఫ్రా స్ట్రక్చర్ అందించ వలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నియోజకవర్గంలో నాలుగు మండలాలకు నాలుగు బొలెరో కొత్త వాహనాలు సమకూర్చనున్నట్లు తెలిపారు. క్రైమ్ రహిత నియోజకవర్గంగా ఉండేందుకు నియోజకవర్గ మొత్తం జిపిఎస్ను అనుసంధానంచేసి 800 సీసీ కెమెరాలు నియోజకవర్గంలో అమర్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎస్పి అద్నాన్ నయీమ్ అస్మి మాట్లాడుతూ నూతన పోలీస్ స్టేషన్ భవనం సరికొత్త హంగులతో సర్వాంగ సుందరంగా ఉందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ నిరంతరం పాటుపడతాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ భీమారావు, డీఎస్పీ జై సూర్య, సిఐ జగదీశ్వరరావు, ఎస్సై నసురుల్లా, జనసేన నియోజకవర్గ ఇన్చార్జి జుత్తిగ నాగరాజు, బిజెపి నియోజకవర్గ కన్వీనర్ కోరా రామ్మూర్తి, టిడిపి సీనియర్ నాయకులు మంతెన నరసింహారాజు, టిడిపి, జనసేన, మండల అధ్యక్షులు కరిమేరక నాగరాజు, వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది టిడిపి, జనసేన, బిజెపి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పట్టిసంకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర -పోలవరం : కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భారీ సంఖ్యలో భక్తులు పట్టిసీమకు తరలివచ్చారు. ఉదయం నుండి భక్తులు గోదావరి నదిపై దాటడానికి లాంచీ వద్ద బారులు తీశారు. లాంచిపై గోదావరి నది దాటి పుణ్యక్షేత్రం రేవులో స్నానాలు చేశారు. అక్కడ నుండి ఇసుక తిన్నెలపై నడుచుకుంటూ వెళ్లి శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో మహిళా భక్తులు కుంకుమ, పువ్వులతో పూజలు చేశారు. అనంతరం వీరేశ్వర స్వామికి పాలు, తేనెలతో అర్చకులు అభిషేకాలు చేసి తీర్థప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా పట్టిసం దేవస్థానం ఈఓ చాగంటి సురేష్ నాయుడు మాట్లాడుతూ వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు, అన్నప్రసాదాలు కూడా ఏర్పాటు చేశామని చెప్పారు.

తాడేపల్లిగూడెంలో రిలయన్స్ ట్రెండ్స్ స్టోర్ ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: ప్రముఖ అప్పారెల్, ఫుట్ వేర్ , యాక్సరసీస్ ప్రత్యేక చైన్ రిలయన్స్ ట్రెండ్స్ స్టోర్ను నగరంలో ఏర్పాటు చేశారు. తాడేపల్లిగూడెం లోని ఎన్టీఆర్ జంక్షన్ బ్రిడ్జి డౌన్ ప్రాంతంలో తమ మొదటి స్టోర్ ని రిలయన్స్ ట్రెండ్స్ ప్రారంభించింది. 8328అడుగుల విస్తీర్ణం గల ఈ నూతన ట్రెండ్స్ స్టోర్ అత్యాధునిక రూపంతో నాణ్యత ఆకర్షణీయమైన దుస్తుల శ్రేణిని కలిగి ఉందని ఆ స్టోర్ ప్రతినిధి చెప్పారు. అలాగే ఈ స్టోర్ తాడేపల్లిగూడెం ప్రాంతపు వినియోగదారుల అభిరుచికి తగిన విధంగా, అందుబాటైన ధరలో మరియు తాము చెల్లించిన ధరకు అత్యధిక విలువని కలిగి ఉందన్నారు. ఈ పట్టణానికి చెందిన కస్టమర్లు సంతృప్తికరమైన ధరలకు ఆధునిక ఉమెన్స్ వేర్, మేన్స్ వేర్, కిడ్స్ వేర్ ఫ్యాషన్ యాక్సరసీస్ కోసం విలక్షణమైన ప్రత్యేక మరియు గొప్ప షాపింగ్ స్టోర్ను సందర్శించాలని కోరారు. ప్రారంభోత్సవపు ఆఫర్ కింద రూ.3499 షాపింగ్ చేస్తే రూ.249 కి ఆకర్షణీయమైన బహుమతి పొందవచ్చునని, రూ.4500 కొనుగోలు పై వినియోగదారులు రూ.1500 విలువగల కూపన్లు పూర్తి ఉచితంగా పొందగలుగుతారని తెలిపారు.

రోడ్ల నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో ఉండాలి

అధికారులకు కలెక్టర్ కె. వెట్రిసెల్వి ఆదేశం

విశాలాంధ్ర ప్రతినిధి - ఏలూరు : జిల్లాలో పల్లెపండుగ కార్యక్రమంలో మంజూరుచేసిన రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పల్లెపండుగ కార్యక్రమంలో మంజూరుచేసిన రోడ్ల నిర్మాణ పనుల ప్రగతిపై సోమవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అధికారులతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పల్లెపండుగ కార్యక్రమం ద్వారా జిల్లాలో గ్రామాలలో 213. 55 కిలోమీటర్ల మేర 1080 రోడ్ల నిర్మాణ పనులను మంజూరు చేయడం జరిగిందని, వీటిలో 229 రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించడం జరిగిందని, 3 పనులు పూర్తి అయ్యాయన్నారు. గ్రామాలలో రోడ్ల నిర్మాణ పనులకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందని, ప్రభుత్వ ఆశయాల మేరకు మంజూరు చేసిన రోడ్ల నిర్మాణ పనులలో తక్కువ నిడివి కలిగిన 215 రోడ్ నిర్మాణ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని, మిగిలిన పనులను డిసెంబర్ నెలాఖాలోగా పూర్తి చేయాలనీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రోడ్ల నిర్మాణ పనులు పూర్తి నాణ్యతతో ఎక్కువ కాలం మన్నేలా ఉండేలా చూడాలన్నారు. రోడ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంట్, ఇసుక కు ఎటువంటి కొరతా లేదని, అధికారులు ప్రత్యేక పర్యవేక్షణతో రోడ్ల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్ ఇంచార్జి ఎస్ఈ ఎం.వి. రమణమూర్తి, డ్వామా పీడీ కె. వెంకట సుబ్బారావు, ప్రభృతులు పాల్గొన్నారు.

అమలు చేయాలి (1వ పేజీ తరువాయి)

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా నాయకులు ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బండి వెంకటేశ్వరరావు, కుంచె వసంతరావు మాట్లాడుతూ స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికి సంవత్సరానికి రూ. 15వేలు తక్షణమే చెల్లించాలని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పించి, నిరుద్యోగ యువకులకు నెలకు రూ. 3వేలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని ప్రతి రైతుకు సంవత్సరానికి రూ. 20వేలు ఆర్థిక సహాయం చేయాలని, 19 సంవత్సరాల దాటిన ప్రతి మహిళ కు నెలకు 1500 రూపాయలు చొప్పున ఏడాదికి 18 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజానీకానికి ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొలిమే బాలయేసు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో : ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేసి వ్యవసాయ కార్మికులను

ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు ఇతర హామీలను కూడా తక్షణమే అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమితి అధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కళింగ లక్ష్మణరావు మాట్లాడుతూ తల్లికి వందనం అమలు చేయకపోవడం వల్ల వ్యవసాయ కార్మికుల పిల్లల ఫీజులు పెనుభారంగా మారి చదువులు మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలతో గ్రామాల్లో, పట్టణాల్లో నివసి స్తున్న పేద ప్రజానీకానికి ఎంతో కొంత కుటుంబాలకు ఆర్థిక సహాయం తోడువు తుందని, సూపర్ సిక్స్ హామీలు అమలు కాకపోవడంతో పేదలు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నారని కళింగ లక్ష్మణరావు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కోన గొల్లయ్య, జిల్లా సమితి సభ్యులు సనపల శ్రీనివాస్, ఉండి ఏరియా కార్యదర్శి తామరాణి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- 26న ఏలూరు కలెక్టరేట్ ముందు నిరసన
- 9న ఏలూరులో సన్నాహక సమావేశం

విశాలాంధ్ర-ఏలూరు: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న అర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. రైతు, కార్మిక సంఘాల నాయకుల సమావేశం సోమవారం ఏలూరులో అన్నే భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహనరావు, బి.కె.ఎం. యు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడోసారి అధికారం చేపట్టిన బిజెపి ప్రభుత్వం తన విధానాలను ఏమాత్రం మార్చుకోలేద న్నారు. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడం లేదని, ఏడాది పాటు రైతుల ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. రైతులు పండిస్తున్న అన్ని పంటలకూ కనీస మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు ఒక్కసారైనా రుణమాఫీ చేయాలని కోరినా పట్టించుకోకుండా, కార్పొరేట్ సంస్థలకు మాత్రం భారీ మొత్తంలో రూ. 14.65 లక్షల కోట్లు రుణమాఫీ చేసిందన్నారు. కేరళలో అమలవుతున్న పంట రుణ ఉపశమన చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కోరారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న సహకార రంగాన్ని కేంద్రం అజమాయిషీలోకి తీసుకునేందుకు కొత్త చట్టం తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్మికుల హక్కులకు భంగంకలిగేలా 42 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా 4 లేబర్ కోడ్లను రూపొందించినట్లు చెప్పారు. గిరిజనులకు నష్టదాయకమైన అటవీ చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. పాడి పరిశ్రమ రంగంలో పాల రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో కార్పొ రేట్లకు అనుకూలంగా మూడు నల్ల చట్టాలను తీసుకొస్తే, రైతుల పోరాట ఫలితంగా పార్లమెంట్లో ఆమోదం పొందలేదన్నారు. ఈనెల 9వ తేదీన ఏలూరులో సిఐటియు జిల్లా కార్యాల యంలో జిల్లా సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో అన్ని రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, కౌలు రైతు, గిరిజన, దళిత, మహిళ యువజన, విద్యార్థి, చేతివృత్తులు, ఇతర ప్రజాసంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డి ఎన్ వి డి ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస డాంగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు సాధ్యం కాని వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాయన్నారు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నారే తప్ప కార్మికుల ప్రయోజనాలపై నోరు మెదపడం లేదన్నారు. 1926 నుంచి పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసే అధికారం ఈ ప్రభుత్వాలకు లేదన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబరు 26న ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగానికి వ్యతిరేకంగా అనుసరి స్తున్న విధానాలపై అర్జీలను అందిస్తున్నట్లు చెప్పారు.

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరచాలి

విశాలాంధ్ర -నూజివీడు : నూజివీడు నియోజకవర్గం ఏఐఎస్ఎఫ్ మహాసభ సోమవారం స్థానిక అమర్భవన్ లో జరిగింది. ఈ సభ సందర్భంగా స్థానిక చిన్న గాంధీ సెంటర్ నుంచి అమర్ భవన్ వరకు విద్యార్థులు ప్రదర్శన నిర్వహించారు. ప్రతినిధులు సభ ప్రారంభ సూచికంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ మహాసభలో పాల్గొన్న మాజీ రాష్ట్ర విద్యార్థి సంఘం నాయకులు చాట్ల పుల్లారావు మాట్లాడుతూ భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్రం కావాలని, బ్రిటీష్ పాలకులను ఈ దేశం నుంచి తరిమి కొట్టాలని లక్ష్యంతో, స్వాతంత్ర సంగ్రామ పోరాటంలో పాల్గొన్న ఏకైక విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ అని గుర్తు చేశారు. నాటి నుండి నేటి వరకు విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. క్యూబా, ఫిలిప్పీన్స్ వంటి సోషలిస్టు దేశాల్లో విద్యా వైద్య రంగాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారని అన్నారు. నేటి పాలకులు నూతన విద్యా విధానం పేరుతో సమూల మార్పులు చేస్తూ ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భగత్ సింగ్ గాంధీజీ, బిఆర్ అంబేద్కర్ చరిత్రలు పాఠ్య పుస్తకాల్లో లేకుండా వక్రీకరిస్తు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను పేద వర్గాలకు అందకుండా చేస్తున్నారని ఇప్పటికే అనేక విద్యా సంస్థలు మూత పడ్డాయని అన్నారు. నూతన కూటమి ప్రభుత్వం విద్యార్థి లోకానికి ఇచ్చిన హామీలు నెరవేర్చాల్సి ఉందని అన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి సాయి కుమార్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చినటువంటి హామీప్రకారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న 3480 కోట్ల విద్యా దీవెన బకాయిలను వెంటనే విడుదల చేయాలి .దీనివల్ల విద్యార్థులు అందరూ కూడా రాష్ట్రవ్యాప్తంగా నిరుద్యోగులుగా మారే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి .ఎందుకంటే కళాశాలలకు సర్టిఫికెట్ల కోసం వెళితే మీరు కచ్చితంగా ఫీజులు చెల్లించవలసిందే అని కళాశాల యాజమాన్యం డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో నూతన జాతీయ విద్యా విధానం పేరుతో3,4,5 తరగతులు విలీనం ప్రక్రియలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 4,500 పాఠశాలలు మూతపడ్డాయి. వాటిని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పున ప్రారంభించాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర 49 వ మహాసభలు నవంబర్ నెల 27 నుండి 30 వరకు విజయనగరం లో జరుగనున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా కన్వీనర్ శివకుమార్ , ఏఐఎస్ఎఫ్ నూజివీడు నాయకులు ఎల్ ఆకాష్, పి ప్రదీప్, వి ప్రవీణ్ కుమార్, ఏ వీరబాబు, ఏ వాసు, బి రాజు , మహిళా నాయకురాలు రాజ్యలక్ష్మి , లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

2.850 మెట్రిక్ టన్నుల బియ్యం పట్టివేత

విశాలాంధ్ర-నల్లజర్ల : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే బియ్యాన్ని దారి మళ్లిస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి జెవిఎస్ ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం పౌర సరఫరాల అధికారులు ఏఎస్వో ఎం. నాగాంజనేయులు అధ్వర్యంలో నల్లజర్లలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్వో ప్రసాద్ వివరాలు తెలియచేస్తూ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వ, తరలింపు చేసే వారిపై దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో నల్లజర్ల రైస్ మిల్లు పై దాడులు నిర్వహించగా శ్రీ రామచంద్ర రైస్‌మిల్లు పక్కన గల షెడ్డులో లక్షా ఇరవై తొమ్మిది వేల రూపాయల ఖరీదైన 2.850 మెట్రిక్ టన్నుల పిడిఎస్ రైస్ పట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు లంక వెంకటకృష్ణ పై కేసు నమోదు చేసినట్టు ప్రసాద్ తెలియ చేశారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేస్తున్న పిడిఎస్ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో తరలించడం, నిల్వ ఉంచడం చట్ట ప్రకారం నేరంగా పేర్కొన్నారు. ఎక్కడైనా అక్రమంగా పిడిఎస్ బియ్యంకు సంబంధించి సమాచారం ఉంటే సంబంధిత మండల కేంద్రంలో ఫిర్యాదు చెయ్యాలని, అటువంటి వారి సమాచారం గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఏఎస్వో ఎం. నాగాంజనేయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు

ప్రధాన రహదారి పనులు పునః ప్రారంభం

విశాలాంధ్ర - సీతానగరం: మండలంలో రాజమహేంద్రవరం నుండి చినకొండేపూడి వరకూ గల ప్రధాన రహదారి నాలుగు లైన్ల నిర్మాణ పనులు సోమవారం పునః ప్రారంభం అయ్యాయి. దాదాపు 75 శాతం పనులను గత ప్రభుత్వ కాలంలో ఆగమేఘాల పై ఎన్నికల ముందు పూర్తి చేశారు. అయితే ఈ పనుల్లో కొన్ని గ్రామాల పరిధిలో కొంతమంది ప్రజలు కోర్టులకు వెళ్లి స్టే ఆర్డర్లు తెచ్చుకున్నారు. దానికి తోడు రోడ్డు నిర్మాణ వ్యయం కూడా 70 కోట్ల నుండి 105 కోట్లకు చేరింది. వీటి అన్నిటిని పరగణలోకి తీసుకొని నిర్మాణ పనులు తిరిగి ప్రారంభం కావడానికి సమయం పట్టింది. ఏది ఏమైనా ప్రధాన రహదారి నిర్మాణం త్వరితగతిన పూర్తి చేస్తామని రాజానగరం నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కూడా అనేక మార్లు తెలిపారు. కూటమి అధికారంలోకి రాగానే రాష్ట్ర వ్యాప్తంగా రోడ్ల నిర్మాణ పనుల పై ప్రత్యేక దృష్టి పెట్టింది అనడంలో అతిశయోక్తి లేదు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

విశాలాంధ్ర-దేవరపల్లి: కొవ్వూరు రెవెన్యూ డివిజన్లో 113 రైతు సేవ కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కొవ్వూరు సబ్ డివిజన్ సహకార అధికారి కృష్ణకాంత్ పేర్కొన్నారు. దేవరపల్లి మండలం ఎర్నగూడెం సొసైటీ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొవ్వూరు సబ్ డివిజన్లో 58 సహకార సంఘాలు ఉన్నాయని వాటిలో 56 సంఘాల ద్వారా సహకార వ్యాపారంతో పాటు పరపతి ఇతర వ్యాపారాలు కొనసాగుతున్న కొవ్వూరు సబ్ డివిజన్లో 9 బంకులలో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేశామని కృష్ణకాంత్ తెలిపారు చిన్నాయగూడెం దుద్దుకూరు ఊనకట్ల ఎర్నగూడెం ఖండవెల్లి సొసైటీ ద్వారా జనరిక్ మెడికల్ షాపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో 339 మందిని సిబ్బంది నియమించినట్లు తెలిపారు

మీ కోసంలో ఐదు అర్జీలు

విశాలాంధ్ర - సీతానగరం: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పిర్యాదు వేదిక మీ కోసంలో ఐదు అర్జీలు వచ్చాయని ఎంపిడిఓ ఎమ్ భారతి తెలిపారు. ఈ అర్జీలలో ప్రధానంగా సీతానగరం గ్రామంలో నివాస గృహాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు నిలిపి వేయాలని మహిళలు అర్జీ ఇచ్చారు. అలాగే రఘుదేవపురం గ్రామ పంచాయితీ సర్పంచ్ అయిన ఇందుగుమిల్లి చంద్రలీల సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహిస్తూ రేషన్ దుకాణం నిర్వహిస్తున్నారు అని పిర్యాదు అర్జీ ఇచ్చారు. కుళాయి, ఇంటి పన్ను, సొసైటీ భూములు పై అర్జీలను అందాయని అన్నారు. వీటి అన్నిటి పై సంబంధిత శాఖ అధికారులు బదిలీ చేసి అర్జీల పరిష్కారం దిశగా కృషి చేస్తామని అన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీకమాసం పూజలు

-ఆలయాలకు పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర - తాళ్లరేవు, యానాం : పవిత్ర కార్తీక సోమవారాన్ని భక్తులు వైభవంగా జరుపుకున్నారు. కార్తీకమాసం తొలి సోమవారం కావడంతో యానాం మరియు మండలంలోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునే పవిత్ర నదీ స్నానాలాచరించి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ప్రధానంగా మండల కేంద్రమైన తాళ్లరేవులోని పురాతన శివాలయంలో అర్చకులు కొండవీటి శివరామకృష్ణ ఆధ్వర్యంలో శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. చొల్లంగి రాజరాజేశ్వరి సహిత సోమేశ్వరస్వామి, పటవల, పిల్లంక గ్రామాల్లోని శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వర స్వామి, పాతకోరంగి కురంగేశ్వరస్వామి, నీలపల్లి నీలకంఠేశ్వరస్వామి, ఇంజరం ఉమా కృపేశ్వరస్వామి, ఉప్పంగల రామలింగేశ్వరస్వామి తదితర ఆలయాలలో స్వామివారికి విశేష పూజలు చేసారు.

వ్యాపార రంగంలో మరింత ఆర్థిక పరిపుష్టి సాధించాలి

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు

విశాలాంధ్ర- దేవరపల్లి: సహకార సంఘాలు పరపేతర వ్యాపార రంగం లో ప్రవేశించి ఆర్థికంగా మరింత పరిపుష్టి సాధించాలని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం ఎర్నగూడెం వేణుగోపాల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బ్యాంకును సోమవారం ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ రైతులకు సేవలందించడంలో సహకార సంఘాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి అన్నారు. వ్యవసాయ రంగం లోనే ఇతర రంగాలలో కూడా సొసైటీలు సేవలు అందించాలని అన్నారు. ముఖ్యంగా రైతులకు కావలసిన పెట్రోల్ డీజిల్ సరఫరా చేయటానికి బంకులు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఎర్నగూడెం సొసైటీలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయటం వలన అన్ని వర్గాల ప్రజల్లో ప్రయోజన కరంగా ఉంటుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సొసైటీలను అభివృద్ధి పథంలో నడిపించడానికి ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎంతో కృషి చేస్తున్నానన్నారు. సొసైటీలకు గత ప్రభుత్వం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేసి సొసైటీల అభివృద్ధి చేయడంలో విఫలమైందని అన్నారు. సొసైటీ కార్యాలయంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును గోపాలపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజులను సొసైటీ కార్యదర్శి ఏం పేరు ఇంటి పేరు ఏం పేరు మంద పెద్దబాబు రైతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ కోపరేటివ్ ఆఫీసర్ వి కృష్ణ కాంత్, సొసైటీ పిఐసి ఇంచార్జి నాగేశ్వరరావు, సబ్ డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి కే సుబ్బారావు, సర్పంచ్ బొంత భరత్ బాబు, సొసైటీ కార్యదర్శి మంద పెద్ద బాబు, దేవరపల్లి మండలం టీడీపీ అధ్యక్షుడు అంఢ్రు అనిల్ , గ్రామ టిడిపి అధ్యక్షుడు బొల్లిన విజయభాస్కర్, తెలుగు దేశం నాయకులు పెనుమత్స సుబ్బ రాజు, గద్దె శ్రీనివాస్, మండా సుబ్బారావు, నాగరాజు, గద్దె మునేశ్వర రావు బుల్లిన రామకృష్ణారావు కారు మంచి స్వామీజీ యద్దనపూడి రవీంద్ర సుంకర దుర్గారావు నున్న చిన్ని దొనెల్లి గంగాధర్ హరినాథ్ గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు కృష్ణ పాలెం సర్పంచ్ నాయుడు దుర్గా ప్రసాద్ దేవరపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు కట్నం గణేష్ బల్ల రాము మాలే సతీష్ టిడిపి నేతలు కాకర్ల సుజనా దేవి బుల్లిన రత్నావళి కరుటూరి ఉషా రాణి కరటూరి శ్రీనివాస్ బల్ల సూర్యచక్రం ఓరుగంటి లక్ష్మీపతి రాజు టిడిపి, జనసేన బిజెపి నేతలు సొసైటీ అధికారులు సిబ్బందిపాల్గొన్నారు.

సౌకర్యాలే కాదు... ఆదాయంపైనా ఆర్టీసీ దృష్టి

విశాలాంధ్ర - కొవ్వూరు : ప్రజల అవసరాలతో పాటు ఆదాయాన్ని అన్వేషిస్తూ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ సేవలను అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని కొవ్వూరు నియోజక వర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నందు కొవ్వూరు నుండి విజయవాడ బస్ సర్వీసును ఎమ్మెల్యే ముప్పిడి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వూరు నుండి విజయవాడ వెళ్లేందుకు ప్రజలు ప్రయాణ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రోడ్ కం రైల్వే బ్రిడ్జి మరమత్తులతో ఉండటం వలన బైపాస్ సర్వీసులను బ్రిడ్జి పైనుండి అనుమతించకపోవడంతో బైపాస్ బస్ సర్వీసులు గ్రామం బ్రిడ్జి మీదుగా వెళ్లడం వలన కొవ్వూరు పట్టణంలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వారి దృష్టికి తీసుకువెళ్లి కొవ్వూరు నుండి విజయవాడకు కొత్త బస్సు సర్వీస్ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ద్వి సభ్య కమిటీ సభ్యులు కంటమనే రామకృష్ణ కొవ్వూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వై వి వి ఎన్ కుమార్, గ్యారేజ్ సూపర్వైజర్ సునయన, అసిస్టెంట్ సూపర్వైజర్ ఎస్ కె మౌలాలి బస్టాండ్ సిబ్బంది గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు

ఎన్ఆర్ఈజీఎస్ గ్రామ సభ

విశాలాంధ్ర - కడియం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 2025-26 సంవత్సరమునకు పనుల గుర్తింపు కోసం కడియం మండలం జేగురుపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 19606 పని దినాలు కల్పించి తూర్పు గోదావరి జిల్లాలో రెండవ స్థానంలో ఉన్నందుకు ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా అంతకంటే ఎక్కువ పని దినాలు కూలీలకు కల్పించే విధంగా, జిల్లాలో ప్రథమ స్థానం దక్కించుకొనే విధంగా ఎక్కువ పనులు గుర్తించి సెల్ఫ్ తయారు చేయవలసినదిగా ఉపాధి సిబ్బందికి తెలిపారు. సరాసరి వేతనం 300/- ఉండేటట్లు చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు నాగిరెడ్డి శివాజీ, పాలపర్తి ప్రకాష్ కుమార్, ఫిషర్ మెన్ సొసైటీ అధ్యక్షులు సాక కిరణ్ కుమార్, బల్ల అన్నవరం, ఇ.సి. ఇన్చార్జ్ ఎపిఒ రమణమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ డివిన్ మూర్తి, ఫిల్డ్ అసిస్టెంట్ కె సత్యనారాయణ పాల్గొన్నారు.

శేఖర్ కుటుంబసభ్యులకు సాయం అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలం యర్నగూడెం గ్రామానికి చెందిన బలేశేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో పార్డ్ఇండియా వ్యవస్థాపకులు బేతాళ వీరాస్వామి సూచన మేరకు సంస్థ సభ్యులు 25కిలోల బియ్యం బస్తాను శేఖర్ కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పార్డ్ సంస్థ సభ్యులు ధూళిపూడి రవీంద్ర సోమశెట్టి వెంకటరావు వైద్యులు సత్యనారాయణ కొంపల్లి బాబూరావు బేతాల దుర్గాభవాని గాలింకి హేమ కుమార్ తదితరులు పాల్గొన్నారు

కస్తూరి కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - కడియం: కడియం మండలం బుర్రిలంక గ్రామంలో ఇటీవల అతి కిరాతకంగా హత్య చేయబడిన వ్యవసాయ కూలీ కస్తూరి కుటుంబానికి నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు రూ.50.000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా పోలరాజు మాట్లాడుతూ పచ్చని నర్సరీలలో ఇలాంటి సంఘటన జరగడం చాలా భాధాకరమని నేరస్తులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్ర మంలో అధ్యక్షులు మల్లు పోలరాజు, కార్యదర్శి గాద నాగేశ్వర రావు, కన్వీనర్ అడ్డగర్ల రమేష్, డైరెక్టర్లు గాజుల రత్తయ్య , పిల్లా శ్రీనివాస్, కో అప్షనల్ మెంబర్ రాజేష్ రత్నం, కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

ఘనంగా సామ్యూల్ సాగర్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - తాళ్లరేవు : తాళ్లరేవు వైఎస్సార్సీపీ సీనియర్ నాయకులు, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్ పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో సుమారు 100 మందికి పైగా రక్తదానం చేశారు. తాళ్లరేవు పరదేశమ్మ పేటలోని క్రీం కాంపౌండ్ ప్రాంగణంలో సామ్యూల్ సాగర్ పుట్టినరోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి జెడ్పీమాజీ చైర్మన్ దున్నా జనార్దనరావు, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, అభిమానులు హాజరై సాగరకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాకినాడ రోటరీ క్లబ్ మెడికల్ ఆఫీసర్ పసుపులేటి కామరాజు నేతృత్వంలో జరిగిన రక్తదాన శిబిరంలో 105 మంది రక్తదానం చేసారు. మండల సర్పంచ్ల సమాఖ్య అధ్యక్షుడు నాగేశ్వరరావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు శ్రీదేవి, శ్రీమన్నారాయణ, చలపతి, నాయకులు పెట్ల సూర్యనారాయణరాజు, నాగరాజు, దవులూరి శ్రీరామ్మూర్తి, బొంతు మోహన్, శాఖా శంకరుడు, వెంటపల్లి నూకరాజు, భైరవమూర్తి, కొల్లు శ్రీను. వినోద్, దణాల బుజ్జి బాబు, గుత్తుల శ్రీను, ప్రజా ప్రతినిధులు, వైఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు అమరిస్తే కఠిన చర్యలు : సీఐ

విశాలాంధ్ర - జగ్గంపేట : వన్యప్రాణులను వేటాడేందుకు అటవీ ప్రాంతాలలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గంపేట సిఐ వైఆర్‌కే శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం ఆయన సర్కిల్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి మండలాలలో ఉన్నటువంటి అటవీ ప్రాంతాలలో వన్యప్రాణులను వేటాడేందుకు గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ తీగలను అమరుస్తున్నారని అటువంటి వాటిపై ఏదైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

ఎంపీడీవోగా రాజు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర - ఆలమూరు : ఆలమూరు మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా రాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఆలమూరు మండల ఈఓపిఆర్డిగా బాధ్యతలు నిర్వహిస్తుండగా ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో కె జాన్ లింకన్ పదవీ విరమణ చేయడంతో రాజును (ఎఫ్ఎసి) ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా పరిషత్ నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిలో భాగంగా సోమవారం ఆయన ఆలమూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన రాజును మండల ప్రజా పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, నాయకులు, అధికారులు అభినందించారు.

పంట పొలాల్లోకి ఉప్పునీరు

అధికారులకు రైతుల ఫిర్యాదు

విశాలాంధ్ర - అల్లవరం : కొమరగిరిపట్నం నీటి సంఘం పరిధిలో పంట కాలవ నాలుగు ఆయకట్టు భూమి లోకి ఉప్పునిరు రావడంతో మండల పరిషత్తు కార్యాలయంలో జరిగే స్పందనలో రైతులు ఫిర్యాదు చేశారు. పంచ నది డ్రైన్, యాచరీ సమీపం నుండి, గుర్రం వారి పొలాల వరకు, పంచ నది డ్రైన్‌కు అనధికారి, తూములు వేయడం వల్ల ఉప్పునీరు పంట పొలాల్లోకి వస్తుందని దానివలన వరి పంట సాగు లేకుండా పోతుందని కొబ్బరి చెట్లు నష్టం జరుగుతుందని, మంచినీటి బావిలు ఉప్పునీరు మయంగా మారినాయని దానివల్ల పశువులకు తాగునీరు లేకుండా పోయిందని రైతులు చెప్పున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి డ్రైన్ అనధికార తూరలను తొలగించాలని గ్రామస్తులు రైతులు కోరుతున్నారు.

కొరుపల్లెలో భూ రీసర్వే సదస్సులు

విశాలాంధ్ర - కరప : కరప మండల కొరిపల్లె గ్రామంలో భూ రిసర్వే సదస్సులలో 9 ఆర్జీలు అందాయని తహశీల్దార్ ఎస్ సత్యనారాయణ పేర్కొన్నారు. భూ సర్వేలో వచ్చిన ప్రతి అర్జీని తప్పనిసరిగా పరిష్కరిస్తామని తాహశీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పలివెల నాగేశ్వరరావు, మండల డిప్యూటీ తాసిల్దార్, మండల సర్వేయర్, ఎంపీటీసీ సభ్యులు, గ్రామ రెవెన్యూ అధికారులు, తెలుగుదేశం, జనసేన, పార్టీ బిజెపి కూటమి సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సభలు

విశాలాంధ్ర - ఆలమూరు : భూ సమస్యలపై రైతులు వేగంగా స్పందించి గ్రామ రెవెన్యూ సభలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ కెజె ప్రకాష్ బాబు అన్నారు. మండలంలోని నర్సిపూడి పంచాయతీ వద్ద ఆయన ఆధ్వర్యంలో సర్పంచ్ కండిబోట్ల శ్రీను అధ్యక్షతన సిబ్బందితో గ్రామ రెవెన్యూ సభ శనివారం నిర్వహించారు. రైతులు తమ భూ సమస్యలపై ఫిర్యాదులు దరఖాస్తుల రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు ఐదు రకాలుగా ఉన్నాయన్నారు. అవి జాయింట్ ఫీల్డ్ విభజన, పట్టాదారు పేరు నమోదు, జాయింట్ ఫీల్డ్ మ్యుటేషన్, విస్తీర్ణం లో వ్యత్యాసం, సర్వేనెంబర్ కర్లేషన్ సవరణగా ఉన్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ స్వామి నాయుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు రాయుడు బాబ్జి, ఎంపీటీసీ సుబ్బారావు, కూటమి నాయకులు బాలాజీ, ఆర్ఐ రామా యమ్మ, మండల సర్వేయర్ ప్రభావతి, కార్యదర్శి కృష్ణ, వీఆర్వో ఏసు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

విశాలాంధ్ర - సామర్లకోట : మండలంలోని హుస్సేన్‌పురంలో అభివృద్ధి పనులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సోమవారం శ్రీకారం చుట్టారు. సుమారు రూ.23 లక్షలతో నిర్మించిన నూతన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే చిన రాజప్ప ప్రారంభించారు. గ్రామ పంచాయతీ ఆధునీకరణ పనులకు శంకుస్థాపనలు చేశారు. చల్లా బుజ్జి ఆధ్వర్యంలో శంకుస్థాపన, ప్రారంభో త్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలోగ్రామ సర్పంచ్ నాగమణి, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నేతలు రామకృష్ణ, కుమారస్వామి, అప్పారావు, కొండ, చంద్రశేఖర్, తలారీ శ్రీను పాల్గొన్నారు.

రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్

విశాలాంధ్ర - గండేపల్లి : కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ గ్రామాల్లో పర్యటిస్తూ ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి అధిష్టానం బలపరిచిన రాజశేఖర్ విజయానికి టిడిపి నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. సోమవారం గండేపల్లి మండలంలో సూరంపాలెం, యర్రంపాలెం, నాయకంపల్లి, యల్లమిల్లి గ్రామలలో టిడిపి నాయకులు కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కుటమి నాయకులందరూ సత్తా సాటాలని ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, మోహనరావు, రాజా, మణిబాబు, ఆదినారాయణ, అడబాల వెంకటేశ్వరరావు, అనుకుల శ్రీకాంత్, కుంచె రామకృష్ణ, పోసిన బాబూరావు పాల్గొన్నారు.

నడకతో ఆరోగ్యం

నడిపూడి వాకర్స్ అండ్ లాఫింగ్ హెల్త్ క్లబ్ ప్రారంభం

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ నడిపూడి గ్రామంలో దాబా గార్డెన్స్‌లోని ఆడిటోరియంలో నడిపూడి వాకర్స్ అండ్ లాఫింగ్ హెల్త్ క్లబ్‌ను అంతర్జాతీయ వాకర్స్ చీఫ్ కో-ఆర్డినేటర్ తేతల సత్యనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం పట్ల అందరూ శ్రద్ధ వహించాలని, ప్రతి రోజు 30నిమిషాలు నడిస్తే రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. ఆరోగ్యానికి నడక నవ్వు యోగా అవసరమని ఆయన తెలిపారు. నూతన క్లబ్ అధ్యక్షులు డాక్టర్ బివి సత్యనారాయణ కార్యదర్శి, బులిటెన్ ఎడిటర్ నడక కవి డాక్టర్ నల్లా నరసింహమూర్తి, కోశాధికారి కడలి సత్యనారాయణలను సత్యనారాయణ రెడ్డి ఘనంగా సన్మానించారు. గ్రామీణ ప్రాంతంలో వాకర్స్ క్లబ్ ఏర్పాటు చేసినందుకు వారిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రెడ్డిని నూతన క్లబ్ కార్యవర్గం ఘనంగా సన్మానించింది. నడకను విశ్వవ్యాప్తం చేసిన నడక క్లబ్బుల వ్యవస్థాపకుడు స్వర్గీయ సుంకర అళ్వాల్ దాస్, కోనసీమ లో నడక ఉద్యమానికి ఊపిరిగా నిలిచి నడకకు పెద్దాయనగా సేవలు అందించిన స్వర్గీయ డాక్టర్ డి రామచంద్రరావు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాపే బాల రవి, సూర్యనారాయణమూర్తి, భీమశంకరం, విప్పర్తి శాంతి ప్రకాష్, గెద్దం భాస్కరరావు, బయ్య వెంకటేశ్వరరావు, నాతి ప్రసాదరావు, ఈతకోట సత్యనారాయణ, విప్పర్తి సత్యనారాయణ, సిహెచ్. సాంబశివరావు, దేవరపల్లి మోహన్‌రావు, విజయ్, కృపా నందం పాల్గొన్నారు.

పనిచేసే ప్రతినిధికి పట్టం కట్టాలి

టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి అశోక్

విశాలాంధ్ర - ముమ్మిడివరం : నగర పంచాయతీలోని ఏడు సచివాలయాలలో సోమవారం రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి చెల్లి అశోక్ సచివాలయాల దగ్గరకు వెళ్లి డిగ్రీ, గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయించాలని, ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కి అత్యధిక మెజార్టీ ఓట్లు నమోదు చేయించాలని, ముమ్మిడివరం నియోజకవర్గంలో 15 వేల ఓట్లు చేయించాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు ఆదేశించారని అశోక్ కోరారు. సమర్ధుడైన రాజశేఖర్‌కు పట్టం కట్టాలని మీకోసం నిరంతరం పనిచేసే ప్రతినిధికి అండగా నిలిచి ఎన్నుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు దొమ్మేటి రమణ కుమార్, నియోజవర్గ బీసీ. సెల్ అధ్యక్షులు పిల్లి నాగరాజు, నగర్ ఎస్సీ సెల్ అధ్యక్షులు గొల్లపల్లి గోపి, కాశి లాజర్, బూరుగు కళ్యాణ్, నీతిపూడి వంశీ, పేయ్యల రత్నరాజు, బడుగు సాయి, యలమంచిలి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బి రోడ్డుకు తూట్లు

పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర - అల్లవరం : అల్లవరం. ఆర్ అండ్ బి రోడ్డుకి కోట్లాది రూపాయిలు కేటాయించి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఆర్డబ్ల్యూఎస్ కాంట్రాక్టర్ ఇష్టారాజ్యముగా రోడ్డును తవ్విస్తున్నారు. ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల ఆరోపిస్తున్నారు. అల్లవరం మండలం మొగల్లమూరు గ్రామంలో మాజీ ఎంపీ చింతా అనూరాధ ఇంటి సమీపంలో సిసి రోడ్ అనుకుని ఇష్టారాజ్యంగా ఆర్‌డబల్ ఎస్ పైప్‌లైన్ ఎందుకు రోడ్డు తవ్వదం వల్ల, రోడ్డు ధ్వంసం అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు అధికారులు పరిశీలించి కోట్ల ఖర్చుపెట్టి రోడ్డు నిర్మాణాలను పాడు చేయకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళల రక్షణపై అవగాహన

విశాలాంధ్ర - జగ్గంపేట, కిర్లంపూడి : మండలంలోని పాఠశాలలు, కళాశాలలో మహిళలకు రక్షణపై విద్యార్థులకు పోలీసులు అవగహన కార్యక్రమాలను సోమవారం నిర్వహించారు. మండలంలోని రామచంద్రపురం, పాలెం, జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లోని విద్యార్థినులకు, తామరాడ మహిళ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినులకు, జిఎంఎస్‌కేలు వై బుజ్జమ్మ, పి వెంకటలక్ష్మిలు పోలీసులు మహిళలకు కల్పించే రక్షణ గురించి వివరించారు.

ఆస్పత్రి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

విశాలాంధ్ర - రాజోలు : రాజోలు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు' అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ స్పష్టం చేశారు. సోమవారం రాజోలు రాజోలు కమ్యూనిటి హెల్త్ సెంటర్ వద్ద ఆసుపత్రి అభివృద్ధి కమిటి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటి చైర్మన్, ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ నియోజక వర్గంలోని నాలుగు మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో కొరత గా ఉన్న వైద్యులను వైద్య సిబ్బందిని నియమించి ఆసు పత్రుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా వైద్యం అందేలా కమిటీ సభ్యులు చూడాలని అన్నారు. ఆసుపత్రిలో నిత్యం డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యం అందించాలని సూచించారు. కమిటి సభ్యులు మట్టపర్తి లక్ష్మి, ఉలిశెట్టి అన్నపూర్ణ, పితాని శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో మార్క్ ఫెడ్ డైరెక్టర్ జి పెదకాపు, స్థానిక సర్పంచ్ రేవు జ్యోతి, గుబ్బల శ్రీనువాస్, చాగంటి స్వామి, గెద్దం మహలక్ష్మీ ప్రసాద్, పినిశెట్టి బుజ్జి, సూరిశెట్టి శ్రీనువాస్, పార్వతి, జొన్నలగడ్డ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

శివాలయంలో అద్భుతం

విశాలాంధ్ర - చాగల్లు: తూర్పు గోదావరి జిల్లా స్థానిక చాగల్లు శ్రీ రాజరాజేశ్వర స్వామి శివాలయంలో అద్భుతం జరిగింది. మహిమాన్వితమైన ఆ పరమశివుని నిత్య అభిషేకం లో భాగంగా మొదటి కార్తీక సోమవారం శివలింగానికి చుట్టుకుని నల్ల త్రాచు దర్శనమివ్వడంతో తన జీవితం ధన్యమైందని అర్చకులు భక్తి పారవశ్యంతో ఆనందం వ్యక్తం చేశారు. పూజలు నిర్వహిస్తున్నారు. ఇన్నేళ్ల శివాలయ చరిత్రలో నేడు జరిగిన పరిణామం ఒక అద్భుతమని భక్తులు భావిస్తున్నారు.

పీజీఆర్ఎస్‌కు 290 అర్జీలు

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజా సమస్యల పరిష్కార నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమం (పీజీఆర్ఎస్) సోమవారం కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాలులో జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జె వెంకటరావు, హౌసింగ్ పీడీ ఎన్వీవీ సత్యనారాయణ, ఐసీడీఎస్ పీడీ కె ప్రవీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె సత్యవతి, పౌరసరఫరాల శాఖ అధికారి ఎంవీ ప్రసాద్, బీసీ సంక్షేమ అధికారి ఎం లల్లి ఇతర అధికారులు హాజరై, ప్రజల నుంచి వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పింఛన్ల, బియ్యం కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్ లైన్లో నమోదు, ఆక్రమణలు తొలగింపు, డ్రైన్, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుద్ధ్యం, సదరం సర్టిఫికేట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం-290అర్జీలు అందాయి. ఈ సందర్భంగా డీఆర్వో జె వెంకటరావు మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వివిధ శాఖలకు అందిన వినతులను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, గడువులోపు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు తదితరులు పాల్గొన్నారు.

కోటి బిల్వార్చన పూజకు రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారి రాచపల్లి జంక్షన్ సమీ పంలో సోమవారం జరుగుతున్న అయ్యప్పస్వామి కోటి బిల్వార్చన పూజా కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. ఈ పూజా కార్యక్రమం వద్ద మురళీకృష్ణ రాజు శబరిమల పందల రాజును కలిశారు.

కస్తూరి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటాం

మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర - కడియం : కడియం మండలం బుర్రిలంక నర్సరీ కూలి రౌతు కస్తూరి హత్య, అత్యాచారం సంఘటనపై రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ విచారం వ్యక్తం చేశారు. బుర్రిలంక కస్తూరి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించి ధైర్యాన్నిచ్చి వారికి లక్ష రూపాయలు సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మత్తులో నలుగురు వ్యక్తులు కలసి అతి దారుణంగా అత్యాచారం చేసి హత్య చేయడం క్షమించరాని నేరం అన్నారు. మానసిక వికలాంగురాలు అయిన కుమార్తెకు వికలాంగ సర్టిఫికెట్‌తో పాటు రూ.15వేలు పింఛన్, గ్రాడ్యుయేట్ చదువుతున్న కుమారునికి చదువు పూర్తి అవ్వగానే ఏదైనా ఉద్యోగం, అదే గ్రామంలో నివాస స్థలం ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఎంతో కాలంగా కలిసిమెలిసి ఉన్న మనుషుల మధ్య గంజాయి మహమ్మారితో కలతలు రేపి హత్యలు అత్యాచారాలు వంటి నేరాలు పెచ్చు మీరుతున్నాయని దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఉక్కు పాదం మోపుతుందని అన్నారు. ఈ కేసును పక్కదారి పట్టకుండా పోలీసులు, నర్సరీ రైతులు సకాలంలో స్పందించి నిజా నిజాలు రాబట్టారని అన్నారు. అలాగే ప్రతి నర్సరీలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, గంజాయిని పూర్తి స్థాయిలో ఈ ప్రాంతంలో అరికట్టేందుకు నర్సరీ రైతులతో పాటు ప్రజలు సహకారాలు పోలీసులకు అందించాలని, గత ప్రభుత్వం పెంచి పోషించిన గంజాయి వనాలను పూర్తిగా రూపుమాపేందుకు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని గంజాయి రహిత ఆంధ్ర ప్రదేశ్ గా మార్చేందుకు కృషి చేస్తున్నారని, అలాగే గంజాయి సేవించిన వారిని గుర్తించేందుకు బ్రీత్ ఎనలైజర్ వంటి ప్రత్యేకమైన సాంకేతికతను రూపొందిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. మంత్రి వెంట డిఎస్పి భవ్య కిషోర్, సిఐ ఏ వెంకటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర రైతు ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, గెద్దం శివ, ఆదిమూలం సాయిబాబా పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు

మండపేట దురాగతంపై కెవిపిఎస్ నిరసన

విశాలాంధ్ర - అల్లవరం : కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అల్లవరం మండలం గోడిలంక అంబేద్కర్ నగర్‌లో జిల్లా కన్వీనర్ శెట్టిబత్తుల తులసిరావు అధ్యక్షతన మండపేట ప్రాంతం ఏడీద గ్రామంలో ముగ్గురు దళిత యువకులపై కొందరు అగ్ర కుల అహంకారంతో గుడిలో కట్టేసి మూకుమ్మడిగా దాడి చేసి కులం పేరుతో దూషించి కొట్టిన దుర్మార్గమైన అగ్రకుల ఉన్మాద సంఘట నను ఖండి స్తూ గోడిలంక గ్రామ ప్రజలం దరితో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ రామకృష్ణ, కిషోర్, శ్రీను, బి సత్యనారా యణ, పి తులసిరావు, బి సుబ్బారావు, తారక రామారావు, కార్తీక్, గ్రామ మహిళలు పాల్గొ న్నారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కీ దళిత సంఘాలు నాయకులు సత్యనారాయణ, పౌర హక్కుల నాయకులు అమలదాసు బాబురావు, సిఐటి ఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతి రావు, బిఎస్పి నాయకులు పోలమూరి మోహన్, కెవిపిఎస్ మం డల నాయకులు గెద్దం విజయ్, గిడ్ల శ్యామ్, గెల్లా రాజేంద్రలతో కలసి ఏడిద గ్రామంలో దళిత యువకులపై దాడికి పాల్పడిన దోషులను అందరిపై అట్రా సిటీ కేసు నమోదు చేసి త్వరితగతిన అరెస్ట్ చేయాలని బాధితులకు సరైన వైద్యం అందించి అన్ని విధాలా న్యాయం చేసి రక్షణ కల్పించాలని, ఇలాంటి సం ఘటనలు పునరావృతం కాకుండా ముంద స్తుగా శాంతి భద్రతలు పటిష్టం చేయాలని, ఈ మధ్యకాలంలో దళితులపై జరుగుతున్న దాడుల సం ఘటనలు రీత్యా విజిలెన్స్ మానిట్రింగ్ సమావే శాలు జరిపించాలని కలెక్టరు మహేష్ కుమార్‌ని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

వృద్ధుడు అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర - రాజోలు : పొన్నమండ గ్రామంలో వృద్దుడు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం. పొన్నమండ గ్రామానికి చెందిన మెడబల జగ్గారావు (88) అనే వృద్ధుడు భార్య ద్రౌపతి కలసి జీవి స్తున్నాడు. ఆదివారం రాత్రి ఇంటిలోపల నుండి పెరట్లో ఉన్న బాత్రూమ్‌కు వచ్చిన జగ్గారావు ఎంత సేపటికి బయటకు రాకపోవడంతో భార్య ద్రౌపతి బయటకు వచ్చి చూసేసరికి భర్త పెరట్లో పడిపోయి ఉన్నాడు. బయటకు వచ్చి కేకలు వేయడంతో స్థానికులు వచ్చి చూడగా జగ్గారావు తలకు గాయమై రక్తపు మడుగులో పడి చనిపోయి ఉన్నాడు.

మృతి పై పలు అనుమానాలు : మృతుడి జగ్గారావు మృతి పై పలు అనుమానాలు ఉన్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. 2022 సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన కండెల్ల సందీప్ అనే వ్యక్తి మృతుని ఇంట్లో చొరబడి భార్య ద్రౌపతి పీక నొక్కి ఆమె మెడలో ఉన్న బంగారం దొంగిలించాడు. అప్పట్లో బాధితులు పోలీసులకు పిర్యాదు చేయగా నేరం రుజువు కావడంతో కండెల్ల సందీప్ రెండేళ్లు జైలు శిక్ష అనుభవించాడు. ఇటీవల జైలు నుండి విడుదల అయిన సందీప్ జగ్గారావు కుటుంబం పై కక్ష తీర్చుకుంటాను అని బెదిరింపులకు పాల్పడడంతో అతనే ఈ హత్య చేసి ఉంటాడు అని మృతుని మనుమడు శ్రీకాంత్ పోలీసులకు పిర్యాదు చేశాడు. సంఘటన జరిగిన సమయంలో మృతుని ఇంట్లో బీరువా తలుపు తెరిచి ఉన్నాయని బీరువాలో ఉన్న నగదు, బంగారం మాయమయ్యాని దొంగతనం కోసం వచ్చి ఈహత్య చేసి ఉండవచ్చు అని పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలాన్ని రాజోలు సిఐ నరేష్ కుమార్ పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూజ్ టీమ్ రంగంలో దిగి ఆధారాలు సేకరించాయి.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - దేవరపల్లి: దళారీ వ్యవస్థ నుండి రైతులను కాపాడటానికి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం ఎర్నగూడెంలో సోమవారం రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి దళారీ వ్యవస్థ నుండి రక్షణ పొందటానికి ధాన్యం కొనుగోలు కేంద్రా లను ఏర్పాటు చేసిందని అన్నారు రైతులు తమ ధాన్యాన్ని దగ్గరలో గల మిల్లులు వద్దకే ధాన్యాన్ని తీసుకొని వెళ్లవచ్చని అన్నారు. ధాన్యం అమ్మిన 24 గంటల్లో రైతుల ఖాతాలో సొమ్ము జమ అవుతుందని, గత వైసిపి ప్రభుత్వం రైతులు ధాన్యం అమ్ముకోవటానికి దూర ప్రాం తంలో ఉన్న మిల్లుల వద్దకు అమ్ముకునే విధంగా ఏర్పాటు చేసింది అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి విజయ్ సొసైటీ కార్యదర్శి మండ పెద్దబాబు గోపాలపురం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ డి సువర్ణ రాజు మండల టీడీపీ అధ్యక్షుడు అనిల్, టీడీపీ నేతలు పెనుమత్స సుబ్బరాజు, నాగరాజు విజయ భాస్కర్, శ్రీనివాస్, స్వామీజీ తదితరులు పాల్గొన్నారు

HINDUJA HOUSING FINANCE

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: 167-169, 2వ అంతస్తు, అన్నాసలై, సైదాపేట్, చెన్నై-600 015, CIN U65922TN2015PLC10093. www.hindujahousingfinanace.com, ప్రాంతీయ కార్యాలయం: డోర్ నం.54-20-10/1ఎ, 3వ అంతస్తు, గురునానక్‌కాలనీ, మెయిన్‌రోడ్డు, ఎస్‌బీఐ బ్యాంక్‌ఎదుట, విజయవాడ-520008

డిమాండ్ నోటీసు

మీరు, క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహ-రుణగ్రహీతలు మరియు హామీదారులు ఈ కింద వివరించినట్లుగా మీ యొక్క స్థిర ఆస్తి(లు)ని తనఖా పెట్టుట ద్వారా ఆస్తి సౌకర్యం(లు)పై హెచ్‌హెచ్‌ఎఫ్ఎల్ నుండి హోమ్‌లోన్/లోన్ వినియోగించుకున్నారు. ఈ మొత్తాలను తిరిగి చెల్లించడంలో విఫలమైనారు; మీ రుణాలు నిరర్థక ఆస్తులుగా వర్గీకరించబడ్డాయి. బకాయి పడిన మొత్తాలను తిరిగి రాబట్టుకునేందుకు సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 కింద చివరిగా తెలిసిన మీ యొక్క చిరునామాలకు పంపిన డిమాండ్ నోటీసు అందజేయబడక తిరిగి పంపబడినది. అందుచేత ప్రత్యామ్నాయ సర్వీసుగా ఈ నోటీసులోని అంశాలను సెక్యూరిటీ ఇంటరెస్ట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిబంధనలు, 2002 నిబంధన 3(1)తో చదివే చట్టంలోని సెక్షన్ 13(2) కింద ఇచ్చట ప్రచురించబడుచున్నవి. రుణగ్రహీతలు, సహ-రుణగ్రహీతలు, హామీదారులు, సెక్యూరిటీలు, మొత్తం బకాయిలు, సెక్షన్ 13 (2) కింద పంపిన డిమాండ్ నోటీసు మరియు క్లెయిమ్ చేసిన మొత్తం మొదలైన వాటి వివరాలు ఈ కింద ఇవ్వబడ్డాయి :

వ.సం.	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత/హామీదారు పేరు/ రుణఖాతా నం.	ఎన్‌పీఏ తేదీ	డిమాండ్ నోటీసు తేదీ & బకాయి మొత్తం
1	1. శ్రీమతి వెంకటలక్ష్మి విల్లూరి ... రుణగ్రహీత, 2. శ్రీ గణేష్ విల్లూరి, ...సహ-రుణగ్రహీత. ఇద్దరూ నివసించునది: ఆర్/ఓ.డోర్ నెం-2-10, మగటపల్లి,మామిడికుదురు మండలం, దుర్గగుడి దగ్గర, అర్బన్, అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా, ఏపి-533248. రుణఖాతా సంఖ్య: **AP/RAJ/AMLP/A000000126.**	05.09.2024	02.11.2024 & తేదీ :29.10.2024 నాటికి వడ్డీతో పాటు రూ. 9,62,515/- (తొమ్మిది లక్షల అరవై రెండు వేల ఐదు వందల పదిహేను రూపాయలు మాత్రమే)
	ఆసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: 06-03-1999 తేదీన రిజిస్టర్ చేయబడిన సేల్ డీడ్ కింద కవర్ చేయబడిన ఆస్తి: డాక్యుమెంట్ నం. 199/199, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, గతంలో తూర్పుగోదావరి జిల్లా, మామిడికుదురు సబ్-రిజిస్ట్రీ, మగటపల్లి గ్రామ పంచాయతీ, మగటపల్లి గ్రామం, జిరాయితీ డ్రై, ఆర్.ఎస్.నెం. 128/4 మొత్తంగా ఎసి.0-54 సెంట్ల నుంచి ఎసి. 0- 1/2 సెంట్లకు సమానమైన 24.2 చదరపు గజాల విస్తీర్ణపు స్థలం, దగ్గరి డోర్ నెం.2-5 సరిహద్దులు: తూర్పు: విల్లూరి ధనరాజు ఇంటి గోడ దక్షిణం:ఆర్.ఎస్.నెం.127/1లో వర్ధనపు వెంకటరెడ్డి కుమార్తె భూమి, పశ్చిమం: క్లెయిమ్ చేసినవారి భూమి (గతంలో కొనుగోలు చేసినది) ఉత్తరం: ఈ ఆర్ఎస్ నం.లో అన్ని ప్రాథమిక హక్కులతో గెద్దం రాజేశ్వరి భూమి. **06-05-1993 తేదీనాటి రిజిస్టర్డ్ సేల్ డీడ్ కింద ఉన్న ఆస్తి:** డాక్యుమెంట్ నెం. 357/1998 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, గతంలో తూర్పుగోదావరి జిల్లా, మామిడికుదురు సబ్-రిజిస్ట్రీ, మగటపల్లి గ్రామ పంచాయతీ, మగటపల్లి గ్రామం, జిరాయితీ డ్రై, ఆర్.ఎస్.నెం. 128/4 దక్షిణాన ఈశాన్య మూలలో పూర్తి మొత్తంగా ఎసి. 0-54 సెంట్ల నుండి 158 చదరపు గజాలకు సమానమైన 0-3 1/4 సెంట్ల విస్తీర్ణం (ప్రస్తుత డోర్ నెం. 2-69/1 ఉనికిలో ఉంది) సరిహద్దులు: తూర్పు: విల్లూరి ధనరాజు భూమి, దక్షిణం: వర్ధనపువెంకటరెడ్డి భూమి పశ్చిమం: నీటిపారుదల కాలువ, ఉత్తరం: అన్ని ప్రాథమిక హక్కులతో పాటు ఈ ఆర్.ఎస్.నం.లో గెద్దం రాజేశ్వరి భూమి.		
2	1. వెంకట వంశీకృష్ణ అంగార ... రుణగ్రహీత, 2. శ్రీమతి లక్ష్మి స్వేత అంగార....సహ-రుణగ్రహీత. ఇద్దరూ నివసించునది: ఆర్/ఓ. హెచ్. నెం.2-135, గ్రంథాలయం వీధి, పోలమూరు, అనపర్తి రూరల్, రాజమండ్రి, తూర్పుగోదావరి, ఆంధ్రప్రదేశ్-533342 రుణఖాతా సంఖ్య: **AP/RAJ/RJDR/A000000064**	05.09.2024	02.11.2024 & తేదీ :29.10.2024 నాటికి వడ్డీతో పాటు రూ.25,91,304/- (ఇరవైఐదు లక్షల తొంభై ఒక్కవేల మూడువందల నాలుగు రూపాయలు మాత్రమే)
	ఆసక్తి సృష్టించబడిన హామీగా పెట్టిన ఆస్తి వివరాలు: తూర్పుగోదావరి జిల్లా, అనపర్తి సబ్ రిజిస్ట్రార్, అనపర్తి మండలం, పొలమూరు గ్రామ పంచాయతీ, పొలమూరు, ఆర్.ఎస్.నం. 203/6-2వ బ్లాక్; డోర్ నంబర్ 2-135; పాత డోర్ నం. 2-126; కొత్త డోర్ నం 2-138; అసెస్‌మెంట్ నం. 433; ఆర్‌సిసి పైకప్పు ఇల్లు, 2 బిట్లను కలిగి ఉంటుంది. 1వ బిట్ (పెంకుటిల్లు మరియు స్థలం) సరిహద్దులు:- తూర్పు : బుధవారపు ఇంద్ర ఇంటి గోడ 50'-03" దక్షిణం : సత్తి సుబ్రహ్మణ్యేశ్వర వర ప్రసాద్ రెడ్డి కాంపౌండ్ గోడ 34'-06" పడమర : మందన గోపాల స్వామి ఆలయ కాంపౌండ్ వాల్ 49'-0" ఉత్తరం : కొంతవరకు 2వ బిట్, కొంత వరకు మెయిన్ రోడ్ -35'-0" విస్తీర్ణం : 192 చదరపు గజాల స్థలం మరియు ఆర్‌సిసి పైకప్పు ఇల్లు. 2వ బిట్‌లో ఉన్న ఇల్లు: తూర్పు: ప్రధాన రహదారి 04'-00" దక్షిణం: 1వ బిట్ 11' 06" పశ్చిమం: మదన గోపాల స్వామి ఆలయ కాంపౌండ్ వాల్, అదే విస్తీర్ణం మేరకు స్థలం 06'-00; ఉత్తరం: మెయిన్ రోడ్డు 12'-00" విస్తీర్ణం: 7చదరపు గజాలు. మొత్తం విస్తీర్ణం: 199 చదరపు గజాలు.		

చట్టంలోని సెక్షన్ 13(2) కింద నోటీసు జారీ చేసిన తేదీ నుండి 60 రోజుల వ్యవధిలో మొత్తం బాకీ చెల్లించవలసిందిగా పై రుణగ్రహీత/లుకు సూచించడమైనది. విఫలమైన పక్షంలో సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క నిబంధనల ప్రకారం పైన ప్రస్తావించిన 13 (2) సెక్షన్ కింద జారీ చేసిన నోటీసు తేదీ నుండి 60 రోజుల గడువు ముగిసిన పిమ్మట తదుపరి చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.

తేదీ : 05.11.2024, ప్రదేశము : తూర్పుగోదావరి

సం/- అధీకృత అధికారి, హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

సమస్యలను సత్వరం పరిష్కరించాలి

కమిషనర్ భావన

విశాలాంధ్ర – కాకినాడ : డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వచ్చే సమస్యల అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన ఐఏఎస్ నగరపాలక అధికారులను ఆదేశించారు. సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సుమారు 15 మంది ఫోన్ చేసి తమ సమస్యలను అధికారులకు వివరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో కమిషనర్ భావన నేరుగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారి సమస్యలను స్వయంగా విని..పరిష్కరించాలని సం బంధిత శాఖల అధికారులకు సూచించారు. టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ ఇలా పలు సమస్య లపై సుమారు 30 అర్జీలు అందాయి. పలువురు కాంట్రాక్టర్లు కూడా నేరుగా కమిషనర్‌కు బిల్లుల చెల్లింపు విషయమై అర్జీలు అందజేశారు. వాటిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారు. ప్రజల సమస్యలను పరిష్కరించ డానికి అధికారులు కృషి చేయాలని సూచించారు. పరిష్కరించిన అర్జీల వివరాలు ఆన్లైన్లో పొందుపర చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ మనోహర్, ఎంహెచ్ డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ శిరీష్, టీపీఆర్వో శైలజ, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ వెంకట్రాజు, ఇంజినీ రింగ్, టౌన్‌ప్లానింగ్ అధిపతులు పాల్గొన్నారు.

వివేకానంద సమితి కృషి అభినందనీయం
కలెక్టర్ నాగరాణి

విశాలాంధ్ర – పెదపూడి : భారతదేశ సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వాన్ని ప్రపంచానికి చాటి చెప్పి అంతర్జాతీయంగా తన మాతృభూమి సగర్వంగా తలెత్తుకునేలా చేసిన మహనీయులు స్వామి వివేకానంద అని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో అనపర్తి శ్రీ రామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో వివేక పథం–2025 పేరిట ముద్రించిన స్వామి వివేకానంద జీవితం–సందేశం ఫోల్డర్స్‌ను కలెక్టర్ నాగరాణి ఆవిష్క రించి తొలిప్రతిని సమితి అధ్యక్షులు పడాల సుబ్బారెడ్డికి అందజేసినట్లు రామ కృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్ తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లా డుతూ స్వామి వివేకానంద భావజాల పరివ్యాప్తికి సమితి చేస్తున్న కృషి అభినం దనీయమన్నారు. రామకృష్ణ మిషన్ సభ్యులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని ప్రతి ఏడాది అనపర్తి మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ ప్రైవేటు పాఠశాల పోటీ పరీక్షలు నిర్వహించి విజే తలకు పురస్కారాలు, బహుమతులు అందజేస్తున్నామని దుర్గా ప్రసాద్ తెలి పారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి (బుల్లి తమ్ము), తేతలి సుందర రామారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్ రెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి (289), మల్లిడి శ్రీనివాసరెడ్డి (లెఫ్ట్) తదితరులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి
ఎంపీపీ చలగళ్ల దొరబాబు

విశాలాంధ్ర – గండేపల్లి : మండల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు అధికారులు, నాయకులు, ప్రజలు సహకరిం చాలని ఎంపీపీ చలగళ్ల దొరబాబు, ఎంపీడీవో నాతి బుజ్జి అన్నారు. సోమ వారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లగళ్ల దొరబాబు అధ్యక్షతన, ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా జడ్పిటిసి సభ్యురాలు పరిమి వెంకటలక్ష్మి మంగతాయారు బాబు, వైస్ ఎంపీపీ బిట్రా వెంకటలక్ష్మి విచ్చేశారు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్ మాట్లాడుతూ, గండేపల్లి మండలానికి సంబంధించి బాల బాలికలకు హాస్టల్ సదుపాయం కల్పించాలని ప్రజా ప్రతినిధులను కోరారు. దానికి వారు సానుకూలంగా స్పందించారు. అనంతరం సిడిపిఓ పూర్ణిమ ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులతో బాలికలను చదివిద్దాం, బాలికలను రక్షించుకుందాం అను నినా దాలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పంటల భీమా పథకంతో రైతులకు ధీమా

విశాలాంధ్ర – రాజానగరం : రైతులు ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంతో రైతులు ధీమాగా ఉండవచ్చని ఉద్యానశాఖాధికారి కె.దివ్యశ్రీ అన్నారు. మండల కేంద్రమైన రాజానగరంలో ఉద్యాన శాఖ ఆధ్వ ర్యంలో రాజానగరం,రంగంపేట మండ లాల రైతు లకు రబీ సీజన్లో జీడిమామిడి పంటభీమా పై అవగాహన, సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖాధికారి దివ్యశ్రీ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులతో పంట నష్టం జరిగిన జీడిమామిడి రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో పంట భీమా పథ కం అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత ఏడాది తూర్పు గోదావరి జిల్లాలో ఖరీఫ్ లో అరటి పంటకు , రబీలో జీడి మామిడి పంటకు భీమా సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. వాతావరణ ఆధారిత ఏపీ ఎస్టిపిఐఎస్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నివేదికను వివరిం చారు. నవంబర్ 1 నుండి 2025 ఏప్రియల్ 30 తేదీ వరకు భీమా పథకం అమలులో ఉంటుందని స్పష్టం చేశారు. తూగో జిల్లాలో జీడి మామిడి పంట భీమా చేసేం దుకు ఇఫ్కో టోక్యో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎంపిక చేయించబడినట్లు చెప్పారు. మూడు ఏళ్ళు వయస్సు దాటిన జీడి మామిడి పంట భీమా చేయు టకు అర్హతగా గుర్తించారని చెప్పారు. ఒక రైతు ఒక ఎకరానికి రూ.1500 చెల్లిస్తే ఎక రానికి రూ. 30000 భీమా వర్తిస్తుందన్నారు. 15వ తేదీ లోపల రైతులు ప్రీమియం చెల్లించాలని కోరా రు. రైతులు కస్టమర్ సర్వీస్ సెంటర్స్, బ్యాంకు లో పోర్టల్ నమోదు చేసుకోవచ్చన్నారు. ఐఎఫ్ఎఫ్కో జిల్లా కో ఆర్డినేటర్ ఎస్.రాజ్ కుమార్ మాట్లా డుతూ ఆసక్తి గల రైతులు నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్లో నమోదు చేసుకోవచ్చని వివరించారు.

ఆ దేవాలయ కమిటీ చైర్మన్ పదవిని ఆర్యవైశ్యులకు కేటాయించండి

ఉపముఖ్యమంత్రికి ఆర్యవైశ్యుల వినతి

విశాలాంధ్ర – పిఠాపురం : పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపురం పర్యటనలో భాగంగా టీటీడీ కళ్యాణ మండపం నందు సమావేశంలో పాల్గొన్న సమయంలో పిఠాపురం నియోజకవర్గం ఆర్యవైశ్యులు పవన్ కళ్యాణ్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని కలిసిన ఆర్యవైశ్యులు పవన్ కళ్యాణ్‌కి వినతి పత్రాన్ని సమర్పించారు. ఆర్యవైశ్యుల సహాయ సహకారాలతో ఎంతో అభివృద్ధి చెందిన శ్రీపాద శ్రీ వల్లభ మహాసంస్థానానికి చెందిన చైర్మన్ పదవి ఆర్యవైశ్యులకు కేటాయించాలని కోరారు. ఎన్నికల సమయంలో ఆర్యవైశ్యులకు పవన్ కళ్యాణ్ శ్రీపాద వల్లభ దేవాలయానికి ఆర్యవైశ్యులకు చైర్మన్ పదవి కేటాయిస్తానని హామీ ఇచ్చినట్లు ఆర్యవైశ్యులు పవన్ కళ్యాణ్‌కి తెలియజేశారు. సేవా కార్యక్రమాలకు ముందుండే ఆర్యవైశ్యులకు చైర్మన్ పదవి ఇవ్వాలని ఆర్యవైశ్య కోరారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ని కలిసిన వారిలో టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం సెక్రటరీ పిఠాపురం నియోజవర్గ ఆర్యవైశ్య ప్రెసిడెంట్ కేత వరపు కృష్ణ, ఇమ్మిడిశెట్టి నాగేంద్ర, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ వెంకట నగేష్, దంగేటి సత్యనారాయణమూర్తి, కంచర్ల నగేష్ తదితరులు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే వర్మ ఆధ్వర్యంలో పవన్ కళ్యాణ్‌ని ఆర్యవైశ్యులు కలిశారు. ఈ కార్యక్రమంలో పిఠాపురం నియోజవర్గ ఆర్యవైశ్య సంఘం నాయ కులు వాసవి క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో పరిష్కరించాలి : కలెక్టర్ వెట్రిసెల్వి

విశాలాంధ్ర ప్రతినిధి – ఏలూరు : సీఎం కార్యాలయం నుండి అందిన ప్రజా ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో నాణ్యమైన పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుండి అందిన ప్రజాఫిర్యా దులు, జిల్లాలో వివిధ కార్యాలయాలలో పీజీఆర్ ఎస్ ద్వారా అందిన ప్రజా సమస్యల దరఖాస్తుల పరిష్కార విధానంపై జిల్లా, మండల స్థాయి అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సోమవారం సాయంత్రం టెలి కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ పీజీఆర్ ఎస్ ద్వారా అందిన ప్రజా సమస్యలలో ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల కార్యాలయం నుండి అందిన ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు అత్యంత శ్రద్ధ చూపాల న్నారు. నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించడంతోపాటు, పరిష్కార విధానంలో నిబంధనల ననుసరించి పేదలకు లబ్ది కలిగేలా నాణ్యమైన పరిష్కారాన్ని చూపాలన్నారు. నిబంధనల మేరకు లేని దరఖాస్తులను తిరస్క రించే సమయంలో అందుకు గల కారణాలను దరఖాస్తుదారునికి స్పష్టంగా తెలియజేయాలన్నారు. పీజీఆర్ ఎస్ ద్వారా అందిన దరఖాస్తులను ఎట్టిపరిస్థి తులలోనూ నిర్దేశించిన సమయంలోగా పరిష్కరించాలని, ఫిర్యాదీదారు మరల దరఖాస్తును రీఓపెన్ చేయకుండా దరఖాస్తులకు నాణ్యమైన పరిష్కా రం చూపాలన్నారు. పరిష్కారం అనంతరం పరిష్కార విధానంపై దరఖాస్తు దారుని స్పందన తెలుసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. డిఆర్ఓ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె. భాస్కర్, డిఎల్డిఓ విజయలక్ష్మి, ప్రభృతులు పాల్గొన్నారు.

మీకోసంలో కలెక్టర్ అర్జీల స్వీకరణ

విశాలాంధ్ర –భీమవరం: ప్రజల నుండి అందే అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగ రాణి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ ఎం. వెంకటేశ్వర్లుతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక – మీకోసం కార్యక్రమం నిర్వహించి వివిధ ప్రాంతాల ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. కలెక్టరేట్‌లో మొత్తం 209 అర్జీలను జిల్లా యంత్రాంగం స్వీకరించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం నుండి వచ్చిన అర్జీలకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. అన్నింటికి చివరి తేదీ వరకు ఆగకుండా ముందుగానే పరిష్కరించాలన్నారు. రీ ఓపెన్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి దోసిరెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డాక్టర్ కె .సి హెచ్ అప్పారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులకు సర్పంచ్ అటంకం
సమస్య పరిష్కారానికి గ్రామస్తుల వినతి

విశాలాంధ్ర – నల్లజర్ల : నల్లజర్ల మండలం అచ్చన్న పాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులు చేసుకునేందుకు గ్రామస్తులకు పంచాయతీ ద్వారా తీర్మానాలు ఇవ్వనంటూ గ్రామ సర్పంచ్ జాలపర్తి సౌజన్య. అడ్డుపడుతున్నారని అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన సుమారు వందమంది సోమవారం స్థానిక ఎంపీడీవో సింహాద్రి రావుకు వినతి పత్రాన్ని గ్రామస్తులు అందజేశారు కొద్ది రోజులుగా పంచాయతీ తీర్మానం లేక పనులు చేసుకోవడానికి పర్మిషన్ లేక తామంతా ఎన్నో బాధలు పడుతున్నామని ఆకలితో పస్తులున్న రాత్రులు సైతం ఉన్నాయని వారు ఎంపీడీవో వద్ద వాపోయారు. గ్రామంలో సుమారు రోజువారి మస్టర్లు ఉంటున్నాయని తక్షణమే తమ సమస్యను పరిష్కారించి తమకు ఉపాధి హామీ పనిలో పని దినాలు కల్పించాలని వారు ఆయన కోరారు

రెడ్డి వన సమారాధనకు భారీ ఏర్పాట్లు : కర్రి త్రినాథ్ రెడ్డి

విశాలాంధ్ర - పెదపూడి : కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం, రెడ్డి హెల్త్ హెల్ప్ లైన్ ఆధ్వర్యంలో ఈనెల 10న దుప్పలపూడి నేషనల్ వెంకటరెడ్డి తోట లో నిర్వహించే వనసమారాధన కార్యక్రమాన్ని రెడ్డి సోదరులంతా విజయవంతం చేయాలని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షులు కర్రి త్రినాథ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. గత ఏడాది నిర్వహించిన వన సమారాధన విజయవంతంగా జరిగిందని ఈ ఏడాది అంతకంటే ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయడం జరుగుతుందని త్రినాథ రెడ్డి తెలిపారు. రెడ్డి వన సమారాధానికి రాష్ట్రంలోని పలు రెడ్డి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంకా అనేకమంది అతిరథ మహారధులు రానున్నారని ఆయన తెలిపారు. వనసమారాధనకు విచ్చేసిన భక్తులకు ప్రతి పది నిమిషాలకోసారి డ్రా తీసి వేలాది రూపాయల విలువ చేసే బహుమతులు అందించనున్నట్లు కర్రి త్రినాథ్ రెడ్డి వెల్లడించారు.

జగ్గంపేటలో వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి

విశాలాంధ్ర - జగ్గంపేట : మండలంలో వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి చెందారు. మండల కేంద్రమైన జగ్గంపేట పోలవరం కాలువలో పడి ఒక యువకుడు మృతి చెందగా, మరొకరు గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందారు. నరేంద్రపట్నంలో విద్యుత్ తీగలు తగిలి ఒక వ్యక్తి మృతి చెందాడు. స్థానిక పోలిసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన జగ్గంపేట నుండి గుర్రంపాలెం వెళ్ళే రోడ్డులో ఉన్న పొలవరం కాలవలో పడి స్థానిక పద్మనాభనగర్‌కు చెందిన చిక్కాల చక్రధర్ (27)మృతి చెందాడు. శ్రీరామ్ నగర్‌లో ఒక గుర్తు తెలియని యాచకుడు చనిపోయాడు. మండలంలోని నరేంద్రపట్నంలో అడవి పందుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు పెట్టిన విద్యుత్ వైర్లు తగిలి గ్రామానికి చెందిన పోతురాజు తలుపులియ్య (37) మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘునాథరావు తెలిపారు.

అన్నా క్యాంటీన్‌లో అన్నదానం

విశాలాంధ్ర - జగ్గంపేట : స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. టిడిపి ఆధ్వర్యంలో ప్రతి వారం దాతల సహకారంతో పేదలకు ఉచితంగా భోజనం అందిస్తున్న సంగతి తెలిసిందే. దానిలో భాగంగా గండేపల్లికి చెందిన యిప్పెర్ల వీర్రాజు ఆర్థిక సహాయంతో అన్న క్యాంటీన్‌లో పేదలకు బోజనాలు ఏర్పాటుచేశారు. వాటిని జగ్గంపేట మండల టిడిపి అధ్యక్షులు మారిశెట్టి భద్రం, తదితర టిడిపి నాయకులు పేదలకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు యిప్పెర్ల సురేష్, చాగంటి సత్యనారాయణమూర్తి వెలమాటి కాశి, కేతిన వెంకన్న చౌదరి, వెంపాటి సతీష్, యిప్పెర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి బస్సు బోల్తా ప్రయాణికులంతా క్షేమం

విశాలాంధ్ర - అనపర్తి : కాకినాడ నుండి రావులపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్సు అనపర్తి మండలం పులగుర్త వద్ద కెనాల్ రోడ్లో అదుపుతప్పి బోల్తాపడింది. అయితే పక్కనే కాల్వ ఉండటం, ఎవరికీ పెద్ద గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇక వివరాల్లోకి వెళితే సోమవారం కాకినాడ డిపోకు సంబంధించిన ఏపీ ఎస్ఆర్టీసీ(ఏపి 05 జెడ్ 0163) బస్సు సుమారు ఉదయం 7:30 గంటలకు 24 మంది ప్రయాణికులతో రావులపాలెం వెళుతుండగా పులగుర్త రామకోటి ప్రాంతానికి వచ్చే సమయానికి బస్సు స్టీరింగ్ సరిగ్గా పనిచేయకపోవడంతో అదుపుతప్పి కెనాల్ రోడ్డు పక్కన కాలవ గట్టుపై బోల్తా పడటం జరిగిందని ఎస్ ఐ శ్రీను నాయక్ తెలిపారు.ఒక మహిళకు స్వల్పంగా గాయమైందని మిగిలిన వారంతా క్షేమంగానే ఉన్నారని చెప్పారు.ప్రమాద సంఘటన పై ప్రయాణికులెవరు ఎటువంటి ఫిర్యాదు చేయలేదని బస్సుని ప్రమాద ప్రాంతం నుండి తరలించడం జరిగిందని ఎస్ఐ శ్రీను నాయక్ వివరించారు.

బైక్‌లతో పోకిరీల ఆగడాలు

భయ బ్రాంతులకు గురవుతున్న విద్యార్థినులు, వాహనదారులు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోటలో కళాశాలలు,పాఠశాలలు వద్ద బైక్‌లను విచ్చలవిడిగా నడుపుతూ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేస్తూ ఈవిటీజింగ్‌కి పాల్పడుతున్నారు. సామర్లకోట శివారు పిఠాపురం రోడ్డు బ్రౌన్ పేట సెంటర్‌లో సుమారు రెండు కళాశాలలు, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలు వుండగా సుమారు 1500 పైబడి విద్యార్థినిలు తమ చదువు నిమిత్తం ఆయా పాఠశాలకు, కళాశాలకు హాజరవడం జరుగుతుంది. కాగా కొంత మంది పోకిరీలు ఉదయం, సాయంత్రం సమయంలో బ్రౌన్ పేట సెంటర్, సిపిఎం సెంటర్, ప్రసన్న జనేయ స్వామి ఆయలం వరకు అత్యంత వేగంగా బైక్ లు నడుపుతూ పలు స్టంట్స్ చేస్తూ యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ భయ బ్రాంతులకి గురి చేస్తున్నారు. పోలీ సులు ఇటీవల తరచూ ఆయా ప్రాంతాల్లో పహారా ఏర్పాటు చేసి పలువురు పోకిరీలకు, అదుపులోకి తీసుకుని హెచ్చరించిన పోకిరీల తీరులో మార్పు రాక పోగా ఇటీవల వారి ఆగడాలు మరింత మితి మీరినట్లు పలువురు పేర్కొంటున్నారు.

హరిహర నామస్మరణలతో నగర సంకీర్తన

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం మల్లేపల్లి కొత్తూరు రామాలయం వద్ద కార్తీక మాసాన్ని పురస్కరించుకొని హరిహర నామ స్మరణలతో తెల్లవారు జామున నగర సంకీర్తన చేశారు. ఎంతో పవిత్రమైన కార్తీక మొదటి సోమవారం సందర్భంగా మాజీ ఉప సర్పంచ్ వెలిది వెంకటేశ్వర రావు దంపతులచేతుల మీదుగా అఖండ జ్యోతిని వెలిగించి భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో గంగారావు వెలిది సుబ్రహ్మణ్యం, పడాల శ్రీను, కాపుగంటి బాబులు, వీరబ్బాయి, గొల్లవిల్లి విష్ణు, వెంకటేశులు, బాబురావు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండల వ్యవసాయ కార్యా లయం వద్ద

సోమవారం క్షేత్ర స్థాయి సిబ్బందికి పంట కోత ప్రయోగాలపై శిక్షణా కార్యక్రమం మండలం వ్యవ సాయ అధికారి సద్గురుమూర్తి నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కోత ప్రయోగాలు నియమాలు లోబడి కచ్చితత్వంతో నిర్వహించాలని ఫారం-1, ఫారం-2 ఆన్లైన్‌తో పాటు, ఆఫ్-లైన్ పేపర్ ఫారం సమర్పించాలని సూచించారు. వపంట కోత ప్రయోగాలులో తీసుకోవలసిన మెలకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - సామర్లకోట : పవిత్ర కార్తీక మహోత్సవాలను పురస్కరించుకుని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్వామివారి సామర్లకోట పంచ రామ క్షేత్రంలో భీమేశ్వర స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో బళ్ల నీలకంఠ, ఉత్సవ కమిటీ ప్రతినిధి కంటే జగదీష్, అడబాల కుమారస్వామి ఎమ్మెల్యే చినరాజప్పకు స్వాగతం పలికారు. అర్చకులు రాంబాబు, వెంకన్న శర్మ ఎమ్మెల్యే దంపతులు పేరు మీదుగా విశేష పూజలు చేశారు. పూజల అనంతరం ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీస్సులు అందించారు. దేశ నలుమూలల నుండి సామర్లకోట పంచరామ క్షేత్రానికి తరలివచ్చే భక్తుల కోసం విస్తృత ఏర్పాటులు చేపట్టినట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు.

మహిళపై దాడి

విశాలాంధ్ర - నల్లజర్ల : వివాహేతర సంబంధం కారణంగా మహిళపై కత్తితో దాడి చేసిన సంఘటన సోమవారం సాయంత్రం నల్లజర్ల మండలం అనంత పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడ వద్ద గొల్లగూడెం గ్రామానికి చెందిన దేగల శ్రీరాములు నల్లజర్ల మండలం అనంత పల్లి గ్రామం ఎన్టీఆర్ కాలనీకి చెందిన గీతలు కలసి కొన్ని రోజుల క్రితం సహజీవనం చేశారు. ఆమెకు అంతకుముందే వివాహమై ఇద్దరు కుమారులు ఉన్నారు. గత కొంతకాలంగా వీరిమధ్య మనస్పర్థలు రావడంతో ఆమె అనంతపల్లిలోని తండ్రి మజ్జి నాగేశ్వరరావు ఇంటి వద్ద ఉంటుంది సోమవారం మధ్యాహ్నం స్థానిక ఆంధ్ర బ్యాంకు వద్దకు వెళ్లి తిరిగి వస్తూ ఉండగా దారిలో మాటు వేసి ఉన్న శ్రీరాములు కత్తితో గీత పై దాడి చేసి ఆమె వీపుపై విచక్షణ రహితంగా నరకడంతో రక్త గాయాలు తో విలవిలాడుతూ కింద పడి పోయింది దగ్గర్లో ఉన్న చోదవరం గ్రామానికి చెందిన మనెల్లి పవన్ కుమార్ మానవత్వంతో స్పందించి దాడిని అడ్డుకోవడంతో శ్రీరాములు అక్కడి నుంచి పరారయ్యాడు .

పరుగుపందెంతో యువతలో క్రీడా స్ఫూర్తి

విశాలాంధ్ర - రాజానగరం : గ్రామీణ ప్రాంత యువతలో క్రీడా స్ఫూర్తి నింపేందుకు క్రాస్‌కంట్రీ వంటి పరుగు పందెం పోటీలు దోహదపడతాయని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు.ఆదికవి నన్నయ వర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో రాజానగరం నుండి కానవరం గ్రామం వెళ్ళే మధ్యలో ఇంటర్ కాలేజియేట్ క్రాస్ కంట్రీ ఛాంపియన్షిప్ కప్ యూని వర్సి టీ టీమ్ సెలక్షన్స్ మెన్ అండ్ ఉమెన్ పోటీలను సోమవారం నిర్వహించారు. 10 కిలోమీటర్లు మేర జరిగిన ఈ క్రీడా పోటీలను స్పోర్ట్స్ బోర్డ్ ఇన్చార్జ్ సెక్రెటరీ, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ జెండా ఊపి ప్రారంభించారు. ఉమ్మడి గోదావరి జిల్లాలోని నన్నయ వర్సిటీ అనుబంధ కళాశాలకి చెందిన మెన్ అండ్ ఉమెన్ క్రీడా కా రులు పోటీలలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మాట్లా దుతూ క్రాస్ కంట్రీ వంటి పోటీలు గ్రామాల మధ్య నుండి నిర్వహించే పరుగు పందెం పోటీలనీ, గ్రామాల నుండి క్రీడా కారులు ఉత్సహంతో పరుగులు తీస్తే గ్రామాల్లోని యువతలో క్రీడా స్ఫూర్తి కలుగుతుందన్నారు. 10 కిలోమీటరు దూరం పాటు జరిగిన పోటీల్లో మెన్ అండ్ ఉమెన్ విద్యా ర్థులు ఉత్సాహంతో పాల్గొన్నార న్నారు. పోటీల్లో ఉన్నత ప్రతిభ కనపరిచిన మెన్, ఉమెన్ విభాగాల నుండి ఆరుగురు విద్యార్థులను వర్సిటీ జట్టుగా ఎంపిక చేసి మంగళూరు యూనివర్సిటీలో ఈ నెల 18 నుండి జరగనున్న ఆల్ ఇండియా క్రాస్ కంట్రీ పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు.క్రీడాకారులు మరింత క్రీడాస్ఫూర్తితో ఆల్ ఇండియా పోటీలలో సైతం సత్తా చాటి వర్సిటీ,కళాశాలకు,గోదావరి జిల్లాలకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఇంటర్ - కాలేజియేట్ క్రాస్ కంట్రీ ఛాంపియన్షిప్ కప్ వర్సిటీ టీమ్ సెలక్షన్స్ మెన్ అండ్ ఉమెన్ పోటీలను విజయవంతం చేసిన ఫిజి కల్ ఎడ్యుకేషన్ విభాగానికి, సహకరించిన రాజానగరం పోలీసు సిబ్బంది,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందికి, జిఎస్ఎల్ వైద్య కళాశాల బృందానికి, అంబులెన్స్ విభాగానికి కృతజ్ఞతలు తెలిపారు.

క్రాస్ కంట్రీ పోటీల్లో విజేతలు వీరే : పది కిలోమీటర్లు మేర నిర్వహించిన క్రాస్ కంట్రీ పోటీల్లో పురుషుల విభాగంలో 10 కిలోమీటర్ల పరుగును కేవలం 36.50 నిమిషాలలో పూర్తి చేసిన తణుకు ఎస్.సి.ఐ.ఎం గవర్నమెంట్ కళాశాల విద్యార్థి బి.సురేష్ అలాగే మహిళల విభాగంలో తణుకు లోని ఎస్.కె.ఎస్.డి మహిళ కళాశాలకి చెందిన బి.నాగ లక్ష్మీ దుర్గ ప్రథమ స్థానాన్ని గెలుచుకున్నారు. ప్రథమ స్థానంలో గెలిచిన విజేతలిద్దరికీ చెరో బంగారు పతకాలను ప్రదానం చేశారు.అలాగే పురుషుల విభాగంలో ద్వితీయ, తృతీయ స్థానాల్లో భీమవరంలోని డి.ఎన్.ఆర్ కళాశాల విద్యార్థి ఎం.లీల గణేష్, భీమడోలు ఎస్.వి డిగ్రీ కాలేజ్ విద్యార్థి పి.సాయిరామ్ కైవసం చేసుకున్నారు. మహిళల విభాగంలో రాజమహేంద్రవరంలోని ఆర్ట్స్ కళాశాల విద్యార్థి వై. కౌశల్య ద్వితీయ స్థానంలో నిలవగా కాకినాడ ఎ.ఎస్.డి.గవర్నమెంట్ కళాశాల విద్యార్థి ఎస్.శిరీష తృతీయ స్థానంలో నిలిచారు.ద్వితీయ, తృతీయ స్థానంలో గెలిచిన విజేతలకు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ అందించడంతో పాటు మెన్ మరియు ఉమెన్ విభాగంలో నాలుగు, ఐదు, ఆరు స్థానాలు సాధించిన క్రీడాకారులకు మెడల్స్ ప్రదానం చేసారు.అనంతరం విజేతలను పలువురు అభినందించారు.ఈ కార్యక్రమం లో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ పి.విజయనిర్మల, సెక్రెటరీలు డాక్టర్ ఎ.సత్యనారాయణ, డాక్టర్ కె.బాల సత్యనారాయణ, అబ్జర్వర్ డాక్టర్ జి.ప్రమీలారాణి, సెలక్షన్ కమిటీ సభ్యులు డాక్టర్ బి.వి.నరసింహరాజు, పి.సునీత మ్మ,రాజానగరం ఎస్ఐ నాగార్జున మరియు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.